ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ మిస్తాయిలు మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

TUESDAY 04TH AUGUST 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 139 COST : 3\- KHAMMAM, TELANGANA

మంగళవారం 04 ఆగస్టు 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :139 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## చిట్టీల వ్యాపారి టోకరా

3కోట్లు ముంచేసిన దంపతులు పరారీ

సంగారెడ్డి,ఆగస్ట్3 అమీన్‌పూర్ మండలం బీరంగూడ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలో చిట్టీల పేరుతో భారీ మోసం జరిగింది. స్థానికంగా సాయి గణెళిష్ టెక్స్‌టైల్స్ పేరుతో బట్టల దుకాణం నిర్వహిస్తున్న శిరీష.. తన భర్త సాంబశివరావుతో కలిసి కొన్నేళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తోంది. అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ కాలనీలోని పలువురు మహిళలను ఆకర్షించి, వారి నుంచి విడతల వారీగా భారీ మొత్తంలో నగదు సేకరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో దాదాపు రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. చిట్టీల గడువు సమీపిస్తుండటంతో డబ్బులు తిరిగి ఇవ్వాల్సిన సమయంలో శిరీష, సాంబశివరావు దంపతులు తమ సొంత ఇంటిని విక్రయించి రాత్రికి రాత్రే పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో మోసపోయిన మహిళలు తీవ్ర ఆందోళనకు గురై అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు

**నిమ్స్ వైద్య బృందానికి సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు**



హైదరాబాద్,ఆగస్ట్3 నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం ఆకాంక్షించారు

## సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

- భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష
- సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు



న్యూఢిల్లీ,ఆగస్ట్3: సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం

➤ మిగతా 2వ పేజిలో..



## వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు
- అన్ని శాఖల అధికారులను ఆదేశించిన సిఎస్

హైదరాబాద్,ఆగస్ట్3: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ప్రాధాన్యత

➤ మిగతా 2వ పేజిలో..



## ఈయేడు కుంభవృష్టి వర్షాలు

- వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే
- రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్3 సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని..

➤ మిగతా 2వ పేజిలో..

## సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

- సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత
- రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలి
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో పక్రియ పూర్తిచేయాలని లక్ష్యం
- 60 రోజుల్లో ప్రధాన పరిపాలనా, దరఖాస్తుల పక్రియ పూర్తి
- గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి
- అనుమతులు రాగానే సీతారామ సాగర్ పనులు పునఃప్రారంభించాలి
- తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు అంతర్రాష్ట్ర విభాగాన్ని బలోపేతం చేయాలి
- మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్ట్3 రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టుల కు పర్యావరణ అనుమతులు సాధించే పక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల పక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి

➤ మిగతా 2వ పేజిలో..



## నిజామబాద్ జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధి

- వైద్యరంగం బలోపేతం చేసే విధంగా చర్యలు
- అధికారులతో సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్,ఆగస్ట్3 నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, వైద్య పరికరాల అందుబాటు, అవసరమైన సిబ్బంది నియామకం, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన

➤ మిగతా 2వ పేజిలో..



## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

**విపక్ష సభ్యుల ఆందోళన మధ్య చర్చ లేకుండానే ఆమోదం**

న్యూఢిల్లీ,ఆగస్ట్3 సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును

➤ మిగతా 2వ పేజిలో..

## సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్యాక్ దక్కదడం సంతోషకరం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్3 డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోష కరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మి కులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. ఖఐక్షఅ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా

➤ మిగతా 2వ పేజిలో..

# ఈయేడు కుంభవృష్టి వర్షాలు

అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.

# నిజామబాద్ జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధి

స్పష్టం చేశారు. నిజామాబాద్ ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నిజామాబాద్ జిల్లాలో ఆరోగ్య సేవల పనితీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు సహా సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై మంత్రి విస్తృతంగా చర్చించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణపై అధికారులను ప్రశ్నించి అవసరమైన సూచనలు చేశారు. ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

# సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్యాక్ దక్కదడం సంతోషకరం

చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు. తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం పక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే ఉ-8 బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కలిగినవని, దేశ స్వాతంత్ర్య స్ఫూర్తికి తగిన విధంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ముందుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని సైనిక్ స్మారక్ వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తారని, అనంతరం హైదరాబాద్ గోల్కొండ కోటలోని రాణీ మహల్ లాన్స్‌లో నిర్వహించే ఈ వేడుకలకు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని సిఎస్ తెలిపారు. వేడుకల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆయన ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేదిక ఏర్పాటు, సిట్టింగ్ ఇతర సౌకర్యాలు, అత్యవసర సేవలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ÷రిళిడ్లు, భవనాల శాఖ వేదిక నిర్మాణం, స్టేజ్, సిట్టింగ్ ఏర్పాట్లు, బ్యారికేడింగ్, రహదారుల మరమ్మతులు, తదితర మౌలిక సదుపాయాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టడంతో పాటు వీఐపీలు, పాల్గొనేవారి రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులు వేదిక పరిసరాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సుందరీకరణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ తగిన సంఖ్యలో వైద్య బృందాలు, అంబులెన్సులు, ప్రాథమిక చికిత్స కేంద్రాలను వ్యూహాత్మక ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని, ఇతర శాఖలు కూడా తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, అన్ని పనులను వేడుకలకు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి తనిఖీలు, సమీక్షలు నిర్వహించాలని, రాష్ట్ర ప్రతిష్ఠను చాటే విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, వాణి ప్రసాద్, జీఏడీ (పొలిటికల్) ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయెల్, డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సమాచార / పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

- జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్3 లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటిశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

# సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై సుదూర ప్రభావం చూపగల ఈ తీర్పు వెలువడటం వెనుక తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు సాధించేందుకు నిరంతరంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో

అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్?ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు.

÷-రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అసలు పర్యావరణ అనుమతులు, ఆ తర్వాత ప్రాజెక్టు పరిధిలో చోటుచేసుకున్న మార్పులు, రీడిజైన్, విస్తరణ, ప్రాజెక్టు ప్రాంత మార్పు, పెండింగ్ దరఖాస్తులు, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులు, పాటించాల్సిన నిబంధనలు, జరిమానాలు ఉంటే వాటి వివరాలు?ఇలా ప్రతి అంశాన్ని ఒకే సమగ్ర దస్త్రంలో పొందుపరచాలని ఆదేశించారు. పర్యావరణ అనుమతుల సాధనకు మంత్రి దశలవారీ కార్యాచరణను నిర్దేశిరచారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, అందుబాటులో ఉన్న పత్రాలు, రికార్డులన్నింటినీ ఏడు రోజుల్లో సమీకరించాలని ఆదేశించారు. నవీకరించిన పర్యావరణ అధ్యయనాలు, నిబంధనల అమలు నివేదికలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలు, ఇతర అవసరమైన దస్త్రాలను 30 రోజుల్లో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రధాన పరిపాలనా పక్రియతోపాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణకు సంబంధించిన దశలను 60 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. చట్టబద్ధ విధానాలు, సంబంధిత సంస్థల పరిశీలనకు లోబడి సాధ్యమైన ప్రతి ప్రాజెక్టుకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి వారం నివేదిక సమర్పించాలని, ప్రతి నెలా ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నిర్ణీత గడువుల అమలులో అలసత్వం, నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదని స్పష్టం చేశారు. ర్యావరణ ప్రభావ అధ్యయనాలు, పునరావాస?పునర్నిర్మాణ ప్రణాళికలు, అటవీ అనుమతుల దస్త్రాలు, భూసేకరణ రికార్డులు, న్యాయస్థానాల్లో దాఖలు చేయాల్సిన కౌంటర్ అఫిడవిట్ల తయారీలో ఏ చిన్న లోపం ఉన్నా మొత్తం అనుమతుల పక్రియ ఆలస్యమయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి పత్రం సాంకేతికంగా, న్యాయపరంగా లోపరహితంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రాజెక్టు డిజైన్లలో గణనీయమైన మార్పులు చేపట్టే ముందే పర్యావరణ, అటవీ, పునరావాసం, భూసేకరణ, పరిహారం తదితర అంశాలను పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలను ముందుగానే పాటించడం ద్వారా న్యాయపరమైన వివాదాలను నివారించవచ్చని, అదే సమయంలో రైతులు, భూ యజమానులు, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల న్యాయబద్ధమైన ప్రయోజనాలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎంత ముఖ్యమో, వాటి పరిధిలో భూములు, జీవనోపాధి కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం?ఈ మూడింటి మధ్య సమతుల్యత ఉండేలా ప్రాజెక్టుల కార్యాచరణ కొనసాగాలని సూచించారు.

గౌరవెల్లి ప్రాజెక్టును ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణకు సిద్ధంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపులను వినియోగంలోకి తీసుకొచ్చే సమయానికి ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందుగానే తనిఖీలు, పరీక్షలు, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను?ఎస్‌ఓపీలను?కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువ వ్యవస్థలను ఇంజినీరింగ్ బృందాలు సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. నీటి స్వేచ్ఛాయుత ప్రవాహానికి అడ్డుగా ఉన్న అవరోధాలను గుర్తించి, అత్యవసర పనులకు అంచనాలు సిద్ధం చేయాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న కాలువ తవ్వకాలు, గట్ల తొలగింపు లేదా కోత అవసరాలు, నీటి విడుదల కేంద్రాలు, గ్రామాల మధ్య అనుసంధానం, రహదారి క్రాసింగ్‌లు, ప్రజల రాకపోకలకు అవసరమైన వంతెనలు తదితర అంశాలన్నింటినీ ఈ తనిఖీల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం ప్రధాన ప్రాధాన్యం అత్యంత కీలకమైన అవరోధాలను తొలగించి, సాధ్యమైనంత త్వరగా నీటిని తరలించగల సామర్థ్యంతో ప్రధాన కాలువల వ్యవస్థను సిద్ధం చేయడమేనని మంత్రి స్పష్టం చేశారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అధ్యయనాలు, పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత అనుమతి లేదా న్యాయపరమైన ఆమోదం లభించిన వెంటనే పనులను పునఃప్రారంభించేందుకు వీలుగా చేపట్టాల్సిన ప్యాకేజీలకు సంబంధించిన ఇంజినీరింగ్ ప్రణాళికలు, అంచనాలు, టెండర్ పత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అనుమతులు వచ్చిన తర్వాత మళ్లీ సన్నాహాల పేరుతో సమయం వృథా కాకూడదని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక అధికారుల బృందం ఉండాలని, ఆ బృందం పత్రాల తయారీ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం, దరఖాస్తుల పురోగతి, పెండింగ్ న్యాయ వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు కేసుల విషయంలో రాష్ట్ర న్యాయ సలహాదారులు, అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో శాఖాధికారులు సన్నిహిత సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న ప్రతి పర్యావరణ కేసును విడివిడిగా సమీక్షించి, నిబంధనల అమలు నివేదికలు, సాంకేతిక రికార్డులు, పర్యావరణ అధ్యయనాలు, కౌంటర్ అఫిడవిట్లను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. న్యాయస్థానంలో కేసు విచారణకు వచ్చిన తర్వాత హడావుడిగా సమాచారం సేకరించే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల సాధన కోసం రాష్ట్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న న్యాయవాది శ్రవణ్‌కుమార్ ఈ సందర్భంగా వివిధ కేసుల ప్రస్తుత స్థితి, సుప్రీంకోర్టు తాజా తీర్పు వల్ల ఏర్పడనున్న న్యాయపరమైన పరిణామాలను సమావేశానికి వివరించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన సూత్రాలు, అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టులవారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యాయబృందం, శాఖాధికారులను ఆదేశించారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

ప్రవేశపెట్టారు. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదాలు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.


# గుల్షన్ నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు వినతి

•ఆంజనేయులు సాగర్



శేరిలింగంపల్లి జోన్ అక్షరం ప్రతినిధి: అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని గుల్షన్ నగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ దెబ్బతినడంతో మురుగు నీరు రోడ్లపైకి పొంగిపొర్లి స్థానిక ప్రజలు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం కారణంగా కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అదేవిధంగా కాలనీలో మంచినీటి సరఫరా కూడా సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ గుల్షన్ నగర్ కాలనీవాసులతో కలిసి వాటర్ బోర్డు డీజీఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ విక్రమ్ రెడ్డి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ, దెబ్బతిన్న డ్రైనేజీ పైప్‌లైన్‌ను అత్యవసరంగా మార్చి, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. అలాగే కాలనీలో మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తగిన ఒత్తిడితో ప్రతిరోజూ తాగునీరు అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డీజీఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ విక్రమ్ రెడ్డి సమస్యను త్వరితగతిన పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రియాజ్ ఉద్దీన్, వలీయుద్దీన్, కమరుద్దీన్, రహమతుల్లా, సాదత్, అబ్బాస్ భాయ్, ఫరూక్ భాయ్, సలీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# 20 లక్షల విలువైన 102 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేసిన జిల్లా పోలీసులు





సూర్యాపేట టౌన్ / ఆగస్టు 3 / అక్షరం న్యూస్

ప్రజల భద్రత, రక్షణలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీసులు మరోసారి విశేష సేవలు అందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సెల్‌ఫోన్ రికవరీ మేళాలో సుమారు రూ.20 లక్షల విలువైన 102 మొబైల్ ఫోన్లను గుర్తించి, వాటిని సంబంధిత బాధితులకు జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ అందజేశారు. ఇది జిల్లాలో 14వ విడత మొబైల్ ఫోన్ పంపిణీ కార్యక్రమం. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ కమ్యూనికేషన్, ఆన్‌లైన్ విద్య, బ్యాంకింగ్ లావాదేవీలకు అత్యంత కీలకమైందని తెలిపారు. గత ఏడాది కాలంలో 1,846 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, ఇప్పటివరకు రూ.4.80 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు అందజేసినట్లు వెల్లడించారు. మొబైల్ పోయినా లేదా దొంగిలించబడినా వెంటనే జజు×= పోర్టల్లో నమోదు చేసుకొని ఫోన్‌ను బ్లాక్ చేయాలని, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్కువ వడ్డీ రుణాలు, బహుమతులు, డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ను నమ్మవద్దని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, డ్రగ్స్, గంజాయి వంటి సామాజిక దురాచారాలను నిర్మూలించేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసులా వ్యవహరించి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. పోయిన మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ ఫోన్ల రికవరీలో విశేష కృషి చేసిన ఐటీ కోర్, సైబర్ వారియర్స్, పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటీ కోర్ సిబ్బంది, సైబర్ వారియర్స్, బాధితులు పాల్గొన్నారు.




## విజయవాడలో కార్మిక నాయకులకు పారిశ్రామిక సంబంధాల శిక్షణ



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: జపాన్‌కు చెందిన జపాన్ ఇంటర్నేషనల్ లేబర్ ఫౌండేషన్ (జిలాఫ్) సహకారంతో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో విజయవాడలోని హయత్ ప్యాలెస్‌లో కార్మిక నాయకులకు పారిశ్రామిక సంబంధాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టిపిసికి చెందిన తెలంగాణ రాష్ట్ర ఐఎన్టీయూసీఎల్ కార్యదర్శి పూసాల తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశ్రామిక సంబంధాల బలోపేతం, కార్మిక--యాజమాన్య సామరస్యం, సామాజిక సంభాషణ, సమిష్టి చర్చలు, కార్మిక చట్టాలు, నాయకత్వ నైపుణ్యాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రస్తుత పారిశ్రామిక పరిస్థితులకు అనుగుణంగా కార్మిక నాయకుల సామర్థ్యాన్ని పెంపొందించడం, నిర్మాణాత్మక పారిశ్రామిక సంబంధాలను ప్రోత్సహించడం, పరిశ్రమల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు ఈ శిక్షణలో పాల్గొని తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు ఆధునిక పారిశ్రామిక సంబంధాలపై అవగాహనను మరింత విస్తరించుకున్నారు.

## పీజీ కళాశాలలో కొనసాగుతున్న ఐసెట్ 2026 ధ్రువపత్రాల పరిశీలన




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఐసెట్--2026 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇనుగాల మనోహర్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల మెమోలు, చదువు ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, 2026 జనవరి 1 తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, డిగ్రీ బదిలీ ధ్రువపత్రం (టి.సి.), ఆధార్ కార్డు, ఆర్థికంగా బలహీన వర్గాల ధ్రువీకరణ పత్రం (ఈడబ్ల్యూఎస్)తో పాటు వాటి జిరాక్స్ ప్రతులను, అసలు ధ్రువపత్రాలను తీసుకురావాలని సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 3వ తేదీ నుంచి తమకు కేటాయించిన ప్రవేశ ఖాతా ద్వారా కళాశాలల ఎంపికకు సంబంధించిన ప్రాధాన్యతలు నమోదు చేయాలని తెలిపారు. మంగళవారం నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధ్రువపత్రాల పరిశీలన అధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రవి, డాక్టర్ రఘుపతి, శ్యాంప్రసాద్, జ్యోతి పాల్గొన్నారు.

## వీర్లపల్లి గ్రామములో ఆర్.జి 1 ఏరియా ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

రామగుండం ఏరియా.1 పరిదిలోని ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా సామాజిక భాద్యత క్రింద ఆర్జి.1 జి.యం డి.లలిత్ కుమార్ సూచన మేరకు సోమవారం వీర్లపల్లి గ్రామములో ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిభిరం నందు హెల్త్ ఆఫీసర్, డాక్టర్ కారం పద్మ ఈ శిబిరంలో తెలియజేస్తూ సింగరేణిలో ప్రభావిత గ్రామమైన వీర్లపల్లి లోని గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ వైద్య శిభిరం నిర్వహించటం జరుగుతుందని ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో సింగరేణి ఉద్యోగులతో పాటు ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ద వహిస్తున్నదని తెలిపారు. ఇట్టి వైద్య శిభిరంలో సీజనల్ వ్యాధులకు సంబధించి బిపి, షుగర్, తదితర 103 మందికి పరిక్షలు నిర్వహించి జ్వరం, జలుబు, పరిక్షలు చేసి తగిన మందులను పంపిణీ చేశారు. వర్షకాలం దృష్ట్యా ప్రత్యేకించి అనారోగ్య సమస్యలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ గారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రములో డాక్టర్ దుర్గం రవి, వీర్లపల్లి గ్రామ 21 డివిజన్ కార్పోరేటర్ కందుల స్వరూప, సింగరేణి ఆర్జి.1 పర్యావరణ పరి రక్షణ అధికారి వేణు, ఏరియా హాస్పిటల్ సిబ్బంది మరియు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐఎఫ్ఎస్ విజేత శశాంక్‌కు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఘన సన్మానం



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) పరీక్షలో దేశవ్యాప్తంగా 78వ ర్యాంక్‌తో పాటు తెలంగాణలో తొలి ర్యాంక్ సాధించిన గోదావరిఖని యువకుడు శశాంక్‌ను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సోమవారం ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందించిన కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. ఉమా మహేశ్వర్--నాగలక్ష్మి దంపతుల కుమారుడైన శశాంక్ అసాధారణ ప్రతిభతో గోదావరిఖని ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్న తల్లిదండ్రుల ఆశయాలు, విలువలతో పెరిగిన శశాంక్ భారత అటవీ సేవలోనూ అదే నిబద్ధతతో ప్రజలకు సేవలందిస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. గోదావరిఖని నుంచి ఐఎఫ్ఎస్‌లో ఈ స్థాయి విజయం సాధించడం ఈ ప్రాంత యువతకు స్ఫూర్తిదాయకమని, శశాంక్ విజయగాథ విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు మూల విజయరెడ్డి, ఈదునూరి శ్రీకాంత్, కల్వచర్ల కృష్ణవేణి, మారుతి, జనగామ శంకర్, ఆకుల రాజారాం, వీరాలాల్, వొల్లాల కమలాకర్, వేణు, సరళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసం గోరింటాకు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కౌశిక లత



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నియోజకవర్గంలోని గంగానగర్ పవర్ హౌస్ కాలనీలో సరిత, శారద, సుశీల ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ కౌశిక లత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడమే కాకుండా మహిళల్లో ఉత్సాహం, ఆనందం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి కాలనీ, ప్రతి ఇంటిలో ఇటువంటి సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించాలని సూచిస్తూ రామగుండం నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక లత మాట్లాడుతూ కుల, మత, ధనిక, పేద అనే తేడాలు చూడనిది స్నేహమని, మంచి స్నేహబంధాలు కుటుంబాల మధ్య కూడా ఆత్మీయతను పెంచి సమాజంలో మంచి వాతావరణాన్ని నెలకొల్పుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లిక, శారద, ఎన్టీపీసీ ఉద్యోగులు, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. మహిళల ఐక్యతను చాటిచెప్పే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని పలువురు ఆకాంక్షించారు.

# సచ్‌దేవా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఘనంగా విద్యార్థి మంత్రివర్గ ప్రమాణ స్వీకారం





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: ఎన్టీపీసీ జ్యోతినగర్‌లోని సచ్‌దేవా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (హైస్కూల్, జూనియర్ కళాశాల)లో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థి మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ మానవ వనరుల విభాగం డిప్యూటీజీఎం ప్రవీణ్ కె. చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా మానవ వనరుల విభాగం డిప్యూటీ మేనేజర్ కేవీఎంకే శ్రీనివాస్ స్నేహలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా 44 మంది సభ్యులతో కూడిన విద్యార్థి మంత్రివర్గం పదవీ ప్రమాణం చేసి, 2026--27 విద్యా సంవత్సరానికి విద్యార్థి నాయకత్వ బాధ్యతలను స్వీకరించింది. ముఖ్య అతిథి ప్రవీణ్ కె. చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతనంగా ఎన్నికైన మంత్రివర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, ఆదర్శ నాయకత్వాన్ని ప్రదర్శిస్తూ తోటి విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని నూతన విద్యార్థి మంత్రివర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సింగరేణి కాలరీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్జీ టు జిఎం లక్ష్మి పతి గౌడ్ కి ఘనంగా సత్కరించారు.

**ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్జీ టు జిఎం లక్ష్మి పతి గౌడ్ కి ఘనంగా సత్కరించారు.**



నూతనంగా బాధ్యతలు చేపట్టిన అర్జీ టు జిఎం లక్ష్మి పతి గౌడ్ ని ఆలయ ఫౌండేషన్ సభ్యులు పూల బోకే అందించి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. అలాగే మునుముందు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే నరహరి ఐఏఎస్ రచించిన ఓబిసి పోరుబాట పుస్తకాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ ఆకునూరి బాలంకూస్ సభ్యులు మూగల మహేష్ పాణిగంటి రాజలింగు, గడమల్ల రాకేష్, బొచ్చు శంకర్, ఎస్ సెండ్ పీసీ డిపార్ట్మెంట్ అరుకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# చిన్నారి శ్రేష్టకు ఆశీస్సులు అందించిన లయన్స్ సభ్యులు





ఖమ్మం జిల్లా / వైరా ఆగస్టు 3 (అక్షరం న్యూస్ )

వైరా మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ ఎదురుగా పాత కూరగాయల మార్కెట్ రోడ్‌లో సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మోదుగు బాలకృష్ణ ( బాలు) ప్రశాంతి దంపతుల కుమార్తె శ్రేష్ట మొదటి పుట్టినరోజు వేడుకలు సోమవారం వారి గృహాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావు సబ్ ఇన్స్పెక్టర్ పుప్పాల రామారావు 12 వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత దుర్గాప్రసాద్ దంపతులు లయన్స్ రంగా సత్యనారాయణ వాసవి దంపతులు రాయపూడి వెంకటేష్ రజిని దంపతులు సీనియర్ పాత్రికేయులు కొత్త వెంకటేశ్వరరావు లయన్స్ సభ్యులు నల్లమోతు లక్ష్మీనారాయణ వై బుచ్చి రామ రావు మరియు దోసపాటి రవి నాగరాజుహాజరై చిన్నారి శ్రేష్టను ఆశీర్వదించి, పాప కు ఉజ్వల భవిష్యత్తుకలగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## అన్నారుగూడెం క్లస్టర్‌కు ఏఈఓ

**•నియమించాలని కోరుతూ**

**• ప్రజావాణిలో జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం**



ఖమ్మం జిల్లా/ తల్లాడ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఆపతి వెంకట రామారావు జిల్లా కలెక్టర్ ని కలిసి అన్నారుగూడెం క్లస్టర్‌కు పూర్తిస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ని తక్షణమే నియమించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, గోపాలపేట గ్రామాలకు సంబంధించిన అన్నారుగూడెం క్లస్టర్‌లో గత మూడు నెలలుగా వ్యవసాయ విస్తరణ అధికారి లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటల సాగుకు సంబంధించిన సాంకేతిక సూచనలు, ప్రభుత్వ పథకాల అమలు, పంట నమోదు, ఎరువులు, విత్తనాల పంపిణీ వంటి వ్యవసాయ సేవలు సకాలంలో అందడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ సమస్యను సానుకూలంగా పరిశీలించి, అన్నారుగూడెం క్లస్టర్‌కు త్వరితగతిన వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించేందుకు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆపతి వెంకట రామారావు కోరారు.

## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

**•కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి**



ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వైరా మున్సిపాలిటీ 5వ వార్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి మాట్లాడుతూ ప్రతి శిశువుకు తల్లిపాలే ఉత్తమ ఆహారమని పేర్కొన్నారు. శిశువు పుట్టిన తొలి గంటలోపే ముర్రుపాలు ఇవ్వడం, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించడం అత్యంత అవసరమని తెలిపారు. అనంతరం రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం పరిపూరక ఆహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడటమే కాకుండా, తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని చెప్పారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి, ప్రతి కుటుంబం శిశు ఆరోగ్య పరిరక్షణలో తమ బాధ్యతను గుర్తించి తల్లిపాల ప్రాముఖ్యతను ప్రోత్సహించాలని కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి నికిత, ఏఎన్ఎం లలితా కూమారి , అంగన్వాడి శ్రీదేవి, ,అంశ వర్కర్ రేణుకా,ప్రమిళ , మహేశ్వరి, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఖిలాషాపూర్ సర్పంచ్



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఆగస్టు 03:

మండలంలో ని ఖిలాషాపూర్ గ్రామ సర్పంచ్ శాగ కవిత అశోక్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యేతన్నీరు హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదు లో ని ఆయన నివాసంలో హరీష్ రావుకు పుష్పగుచ్ఛం అందించగా సర్పంచ్ హరీష్ రావుఆత్మీయ స్వాగతం పలికి అభినందించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులు తదితర అంశాలపై చర్చించగా ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని తెలిపినట్లు చెప్పారు

## 2032 నాటికి 150 గిగావాట్ల సామర్థ్యమే లక్ష్యం: ఎన్‌టీపీసీ




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టిపిసి లిమిటెడ్ తన లక్ష్యాన్ని మరింత విస్తరించింది. ఒకప్పుడు 2032 నాటికి లక్ష 32 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్న ఎన్టిపిసి ఇప్పుడు తన లక్ష్యాన్ని పెంచుకున్నది. దేశంలోని అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ 2032 నాటికి 150 గిగావాట్ల, 2037 నాటికి 250 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు సంస్థ నిర్వహించిన విశ్లేషకులు, సంస్థాగత పెట్టుబడిదారుల సమావేశంలో తన సమీకృత ఇంధన వ్యూహాన్ని వెల్లడించింది. దీర్ఘకాలిక ఇంధన భద్రత కోసం బొగ్గు ఆధారిత విద్యుత్‌తో పాటు పునరుత్పాదక ఇంధనం, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, అణు విద్యుత్‌పై దృష్టి సారిస్తున్నట్లు తెలిపింది. 2047 నాటికి 30 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. పునరుత్పాదక విద్యుత్‌లో అంతరాయాలను అధిగమించేందుకు పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ నిల్వ వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ మూలధన వ్యయంగా రూ. 49,000 కోట్లు వెచ్చించాలని సంస్థ యోచిస్తోంది. అదే సంవత్సరంలో ఏకీకృత పన్ను అనంతర లాభం రూ. 27,546 కోట్లు, స్టాండ్‌అలోన్ పన్ను అనంతర లాభం రూ. 23,162 కోట్లుగా నమోదైనట్లు వెల్లడించింది. మొదటి త్రైమాసికంలో స్టాండ్‌అలోన్ పన్ను అనంతర లాభం రూ. 5,343 కోట్లుగా నమోదైంది. అలాగే బొగ్గు ఉత్పత్తి 48.66 మిలియన్ టన్నులకు చేరిందని సంస్థ తెలిపింది.

## చిన్నారి శ్రేష్టకు ఆశీస్సులు అందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ కాట్ల సంతోష్



ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 3 ( అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ ఎదురుగా పాత కూరగాయల మార్కెట్ రోడ్‌లో బాలు ప్రశాంతి దంపతుల కుమార్తె శ్రేష్ట తొలి పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కాట్ల సంతోష్ హాజరై చిన్నారి శ్రేష్టను ఆశీర్వదించి, ఆమెకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దోసపాటి రవి, రాయపూడి వెంకటేష్, రంగా సత్యనారాయణతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి ఏడుగురు అరెస్ట్

సూర్యాపేట /నేరేడుచర్ల / ఆగస్టు 3 / అక్షరం న్యూస్

నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామ శివారులో అందర్--బాహర్ పేకాట నిర్వహిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ. 1,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై జూద నిరోధక చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## అవయవ దానంపై మెడికోలకు అవగాహన

•ఆర్గాన్ డొనేషన్ పై మెడికోలకు పోటీలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సిమ్స్ వైద్య కళాశాలలో అవయవ దానంపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నాటో, జీవన్‌దాన్ ఉన్నతాధికారుల సూచనల మేరకు సిమ్స్ మెడికల్ కాలేజీ నిర్వహించిన పెయింటింగ్, నినాద రచన, వ్యాస రచన, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దయాళ్ సింగ్, గోదావరిఖని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్ అభినందన పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అవయవదానం మహాదానమని, బ్రెయిన్‌డెత్ సంభవించిన సందర్భాల్లో కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజ హితం కోసం అవయవ, దేహదానాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్న సదాశయ ఫౌండేషన్ సేవలను డాక్టర్ హిమబిందు సింగ్ ప్రశంసించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, కార్యదర్శి భీష్మాచారిని ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... మరణానంతరం మట్టిలో కలిసిపోయే అవయవాలను దానం చేయడం ద్వారా పలువురి ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామంలో 250 మందికిపైగా నేత్రదానం చేయడం స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. తన భర్త ప్రభంజన్ యాదవ్ నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు, దేహాన్ని జనగామ వైద్య కళాశాలకు దానం చేసిన సిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖను సదాశయ ఫౌండేషన్ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ కన్నాల ఇన్‌చార్జి చింతకింది కనకయ్య, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై తక్షణ స్పందనతో పరిష్కారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ




జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ప్రజల సమస్యలకు సత్వర,పారదర్శక మరియు నిష్పక్షపాత పరిష్కారం అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు.

సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారించి చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం చేయడం పోలీసు శాఖ యొక్క ప్రధాన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ప్రజలు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని,ప్రతి ఫిర్యాదును చట్ట పరిధిలో ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు రామగుండం పోలీసు శాఖ కట్టుబడి ఉందని కమిషనర్ తెలిపారు.

## ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో ఎస్ కె ట్రేడర్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

•ఖమ్మం ప్రజలను ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్.



ఖమ్మం జిల్లా / ఖమ్మం టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

ఖమ్మం నగరం పెవిలియన్ గ్రౌండ్ లో ఎస్ కె ట్రేడర్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.వినోదపు రైడ్‌లు జెయింట్ వీల్, బ్రేక్ డాన్స్ మరియు కొలంబస్ వంటి సరదా కార్యకలాపాలు మరియు రైడ్‌లు కుటుంబాలు మరియు పిల్లలకు అనుకూలంగా ఉంటాయి.ఫుడ్ కోర్టులు అనేక స్థానిక ఆహార మరియు చిరుతిండి దుకాణాలు. షాపింగ్ స్టాల్స్ లో గృహ వంటగది సామాగ్రి దుస్తులు బొమ్మలు మరియు ఫ్యాషన్ ఆభరణాలను విక్రయించే అనేక రకాల విక్రేతలు అందుబాటులో ఉంటాయని ఆగస్టు నెల మొత్తం ఖమ్మం నగర ప్రజలకు అందుబాటులో నిర్వాహకులు జానకి రామయ్య తెలిపారు.

# తెలంగాణలో చారిత్రక కట్టడాల పరిరక్షణకు పెద్దపీట

•పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానం విస్తరణకు కేంద్రం చర్యలు..

•లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నలకు వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రులు..



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

న్యూ ఢిల్లీ: దేశవ్యాప్తంగా చారిత్రక సంపద పరిరక్షణతో పాటు, విద్యారంగంలో ఆధునిక సాంకేతికతను జోడించి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు... ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్‌సభలో సోమవారం అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు వివరాలు వెల్లడించింది. పర్యాటక రంగం బలోపేతానికి చర్యలు, డిజిటల్ విద్యాబోధన తీరుతెన్నులపై వేర్వేరుగా అడిగిన ప్రశ్నలకు.. కేంద్ర విద్యా శాఖ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చారు.

### చారిత్రక కట్టడాల పరిరక్షణకు నిధులు..

దేశవ్యాప్తంగా పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ ఐ) పరిధిలో ఉన్న చారిత్రక కట్టడాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. దేశంలో మొత్తం 3,688 కేంద్ర రక్షిత స్మారక చిహ్నాలు, ప్రదేశాలు ఉన్నాయని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని చారిత్రక కట్టడాల పరిరక్షణకు హైదరాబాద్ సర్కిల్ ద్వారా గడచిన ఐదేళ్లలో (2021-22 నుండి 2025-26 వరకు) కేటాయించిన నిధులు మరియు వ్యయానికి సంబంధించిన వివరాలను ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ (హైదరాబాద్ సర్కిల్) పరిధిలో గత ఐదేళ్ల బడ్జెట్ కేటాయింపులు ఇలా..

2021-22లో రూ. 7 కోట్లుగా ఉన్న కేటాయింపులు, 2022-23 నాటికి రూ. 15.50 కోట్లకు పెరిగాయని, 2025-26లో రూ. 14.93 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. 'అడాప్ట్ ఎ హెరిటేజ్ 2.0' కింద చారిత్రక ప్రదేశాల్లో వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ప్రోత్సాహం..

పాఠశాలల్లో డిజిటల్ విద్యను మరింత విస్తృతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలపై లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి వివరాలు కోరారు. జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించడానికి బడ్జెట్ కేటాయించినట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు.

### తెలంగాణ డిజిటల్ మౌలిక వసతులు..

రాష్ట్రంలో మొత్తం ఎంపిక చేసిన పాఠశాలలు 41,762 ఉండగా.. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను అందించే దిశగా 2,104 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటయ్యాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 20,490 పాఠశాలల్లో కంప్యూటర్ సౌకర్యం అందుబాటులోకి రాగా, 15,535 పాఠశాలలకు ఇంటర్నెట్ సేవలు అనుసంధానించబడ్డాయని మంత్రి తెలిపారు.

### ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ..

రాష్ట్రంలో డిజిటల్ బోధనపై శిక్షణ పొందిన ఉపాధ్యాయుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోందని తెలిపారు. 2020-21లో 2,980 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణను అందుకోగా, 2021-22 నాటికి ఈ సంఖ్య 75,735 మందికి చేరిందని, 2022-23లో 31,273 మంది, 2023-24లో 448 మంది, 2024-25లో 16,618 మంది, 2025-26లో 22,519 మంది ఉపాధ్యాయులు డిజిటల్ శిక్షణను పూర్తి చేసుకున్నట్లు ఆయన వివరించారు.

## శ్రీనన్న ఆత్మీయ భరోసా ప్రతి పేద కుటుంబ నమ్మకానికి ప్రతిక

•పీఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 44 కుటుంబాలకు 10,000/ రూపాయల ఆర్థిక భరోసా..



జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 3 ( అక్షరం న్యూస్)

కూసుమంచి: కూసుమంచి మండలంలో నేలపట్ల, లోక్య తండా, గంగ బండ తండ, గట్టుసింగారం, మల్లెపల్లి, పెరక సింగారం, హిరమన్ తండ, నాయకన్ గూడెం, పాలేరు, సంధ్య తండ, గైగోలపల్లి, పోచారం, ముత్యాల గూడెం, కేశవపురం, తురకగూడెం,కూసుమంచి గ్రామాలలో వివిధ కారణాలతో మరణించిన 44 కుటుంబాలకు పీఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ లికుటుంబ పెద్ద ను కోల్పోయి కష్ట సమయంలో మమ్మల్ని ఒంటరిగా వదిలేయకుండా మా కుటుంబాలకు అండగా నిలిచిన మంత్రివర్యులు పొంగులేటి శ్రీనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మంకెన వాసు, జిల్లా నాయకులు జొన్నలగడ్డ రవి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాల్ రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి,మాజీ సర్పంచ్ చాట్ల పరుశురాం, కొర్ర రమేష్, కొత్త పుల్లారెడ్డి, సర్పంచ్ లు వడిత్య వెంకటేష్ నాయక్, బాదావత్ నరేష్, యువజన విభాగం శేఖర్ రెడ్డి, మహమ్మద్ రఫీ ఆయా గ్రామ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బాధితులకు కొండంత అండగా పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్

•తిరుమలాయపాలెం మండలంలోని

•26 గ్రామాల్లో ఆర్థిక సాయం అందజేత..

•మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనలతో

•60 కుటుంబాలకు రూ.10 వేల చొప్పున పంపిణీ



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

తిరుమలాయపాలెం : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు తిరుమలాయపాలెం మండలంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జూలై 1 నుంచి జూలై 31 వరకు వివిధ కారణాలతో మరణించిన మొత్తం 60 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 10,000 చొప్పున.. మొత్తం రూ. 6 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.మండల పరిధిలోని తిరుమలాయపాలెం, బాలాజీనగర్ తండా, పిండిప్రోలు, తెట్టెలపాడు, కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, అజ్మీరా తండా, జల్లెపల్లి, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, గోల్‌తండా, చంద్రుతండా, మేకలతండా, మేడిదపల్లి, మహ్మదాపురం, ఇస్లావత్‌తండా, రఘునాథపాలెం, కాకరవాయి, జూపెడ, రాజారం, బచ్చోడుతండా, బచ్చోడు, బీరోలు, ఏలువారిగూడెం, దమ్మాయిగూడెం, ఎర్రగడ్డ తండా మొత్తం 26 గ్రామాల్లో బాధితుల ఇళ్లకు వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి ఈ సహాయాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... ప్రతి నెల క్రమం తప్పకుండా పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధితులకు ఆర్థిక సాయం అందిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పొంగులేటి అభిమానులు పాల్గొన్నారు.

## భూ భారతి ఉద్యోగులకు భద్రత కల్పించాలి

•15 నెలల పెండింగ్ జీతాల విడుదలకు అదనపు కలెక్టర్‌కు వినతి..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 03/అక్షరం న్యూస్:-

భూ భారతి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జిల్లా భూ భారతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సోమవారం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.జిల్లా సంఘం అధ్యక్షుడు భీమదేవరపల్లి మండల ఫీల్డ్ టెక్నికల్ అసిస్టెంట్ మంచాల సాయిరాం, జిల్లా కార్యదర్శి ముత్తినేని సత్యనారాయణ ఉపాధ్యక్షురాలు సోమ సాగరిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాలు, 77 మండలాల్లో ప్రస్తుతం ప్రతి జిల్లా కార్యాలయంలో ఒక జిల్లా కోఆర్డినేటర్ ఇద్దరు బఫర్ సిబ్బంది. విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం 57 పోస్టులను తగ్గించే యోచనతో 57 కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న 636 మంది ఫీల్డ్ టెక్నికల్ సిబ్బందిని 332 మందికి కుదించే ప్రతిపాదన వల్ల 304 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఈ ప్రతిపాదనలను ఉపసంహరించుకొని ప్రస్తుతం విధుల్లో ఉన్న సిబ్బందినే కొనసాగించాలని పెండింగ్‌లో ఉన్న 15 నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన భూ భారతి ఫీల్డ్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చలో కొత్తగూడెం ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవ సభను వేలాదిగా తరలి రావాలి

- ఎల్ హెచ్ పి ఎస్.రాష్ట్ర కార్యదర్శి
- కృష్ణానాయక్. జిల్లా అధ్యక్షులు.దశరథ్ నాయక్.....



ఖమ్మం జిల్లా/ తల్లాడ టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

పెనుబల్లి మండలం సోమ్లా నాయక్ తండ లో మండల అధ్యక్షుడు పండు నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి కృష్ణానాయక్ జిల్లా అధ్యక్షులు.దశరథ్ నాయక్. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్.నందు నాయక్ కరపాత్రం ఆవిష్కరణ.ప్రపంచ ఆదివాసీ (గిరిజన) దినోత్సవ సభగిరిజన ఆదివాసీల ఆత్మగౌరవం -- మన హక్కుల సాధనే మన లక్ష్యం..తేదీ: 09-08-2026 (ఆదివారం)సమయం: ఉదయం 10:00 గంటలకువేదిక: కొత్తగూడెం క్లబ్,ప్రధాన డిమాండ్లు:?? గోర్ బోలి ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చాలి ??గూ ల రిజర్వేషను, కేంద్ర ప్రభుత్వం 7.5% రిజర్వేషన్ ను జనాభా ధమాషాప్రకారంగా 14%శాతం పెంచాలి. ??తెలంగాణ రాష్ట్ర ఎస్టి ల 10% రిజర్వేషన్ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో వెంటనే చేర్చాలి.??దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఒకేఎస్టి జాబితాలో కేంద్ర ప్రభుత్వం చేర్చాలి.

??తాండాల గ్రామపంచాయతీలను -రెవెన్యూ గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేయాలి. తండా డెవలప్మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలి.?? ఎస్టీ లు సాగు చేస్తున్న లావాణి, సీలింగ్, పోడు భూములకు శాశ్వతంగా పూర్తి హక్కులతో అసెంబ్లీలో చట్టం చేసి పట్టాలు ఇవ్వాలి.??రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 100%శాతం రిజర్వేషన్ ఎస్టి లకు రాష్ట్రములో అమలు చేయాలి.. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాష్ట్ర కార్యదర్శి.కృష్ణ నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు. దశరథ్ నాయక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నందు నాయక్. సీనియర్ నాయకులు బర్మావత్ మంగు నాయక్ మండల అధ్యక్షులు. పండు నాయక్. శీను నాయక్ రాములు నాయక్ సోనీ భాయి దర్గీ బాయి సోమ్లీ భాయి వాలీబాయి రమేష్ నాయక్ నందు నాయక్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట / ఆగస్టు 3 / అక్షరం న్యూస్

ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిలో స్వీకరించే ప్రతి ప్రజావాణి దరఖాస్తును తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పాత పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, కొత్తగా వచ్చే దరఖాస్తులను వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను కూడా సంబంధిత శాఖలు ప్రత్యేక చొరవతో త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణిపై కూడా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరై స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ వారపు ప్రజావాణిలో మొత్తం 117 దరఖాస్తులు అందగా, వాటిలో 59 భూ సమస్యలకు, 10 మహిళా, శిశు సంక్షేమ శాఖకు, 7 పంచాయతీరాజ్ శాఖకు, 6 వైద్య ఆరోగ్య శాఖకు, మిగిలిన 35 వివిధ శాఖలకు సంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. అన్ని దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య, సీపీఓ కిషన్, డీఈఓ అశోక్, డీపీఓ యాదగిరి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాల, యంగ్ ఇండియా స్కూల్ పనులు వేగవంతం చేయాలి





- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- కళాశాల పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలి..
- హాస్టళ్లు సెప్టెంబర్‌లో, అడ్మిన్ బ్లాక్ అక్టోబర్‌లో, అన్ని పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలి..
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు అందుబాటులో ఉండాలి..

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.సోమవారం రఘునాథపాలెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక (షెడ్యూల్) సిద్ధం చేయాలని సూచించారు. వైద్య కళాశాల ప్రహరీ గోడ, హాస్టల్, అంతర్గత రహదారులు పూర్తి చేయాలని, అవసరమైన నిర్మాణ పనులకు సంబంధించిన రివైజ్డ్ ఎస్టిమేట్స్‌కు నిరంతరం ఫాలోఅప్ చేసి త్వరితగతిన ఆమోదాలు పొందాలని అధికారులను ఆదేశించారు.బాలికల హాస్టల్ నిర్మాణాన్ని సెప్టెంబర్ 1 నాటికి పూర్తి చేయాలని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహతో టెలిఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనుల పూర్తి కోసం అదనంగా రూ.64 కోట్ల నిధులు



మంజూరు చేయాలని కోరారు. నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, ప్రధానంగా విద్యుత్, మౌళిక సదుపాయాల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, నిధులు మంజూరైతే పూర్తి చేసి కళాశాలను ప్రారంభించే అవకాశం ఉంటుందని వివరించారు.ముందుగా గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌కు సంబంధించిన విద్యుత్ పనులను పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని, సెప్టెంబర్‌లో హాస్టళ్ల నిర్మాణం, అక్టోబర్‌లో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ పనులు పూర్తి చేసి, డిసెంబర్ చివరి నాటికి అన్ని నిర్మాణాలను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు. ఖమ్మంలో ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో అప్పటిలోగా అన్ని పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే జిల్లా కలెక్టర్, తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వైద్య కళాశాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని సూచించారు.అనంతరం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి, మొత్తం 17 బ్లాకులు, పేరెంట్స్ లాంజ్, కిచెన్, డైనింగ్ హాల్‌తో పాటు అన్ని నిర్మాణాలను నాణ్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా హాస్టళ్లు, అకడమిక్ బ్లాకులు, అంతర్గత రహదారులు, ఇతర మౌళిక సదుపాయాల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.గ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని పూర్తిచేసి సంబంధిత శాఖకు అప్పగించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అన్ని పనులను సమయానికి పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, వైద్య శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మ్యాజిక్ డ్రైనేజికి భూమి పూజ



జనగామ జిల్లా/రఘునాధపల్లి/( అక్షరం న్యూస్)ఆగస్టు 03: మండలంలోని కన్నాయిపల్లి గ్రామంలో వీ-బీ-జీ-రామ్-జీ పథకం కింద మంజూరయిన మ్యాజిక్ డ్రైనేజి (పెద్ద సైజు ఇంకుడు గుంత) నిర్మాణానికి సర్పంచ్ లోనే అంజమ్మ సోమవారం భూమి పూజ చేశారు. కార్య క్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు లోనే శ్రావణ్ కుమార్, మల్కపురం లక్ష్మీనారయణ, కన్నా హరీష్ కుమార్, ఉప సర్పంచ్ బాషపాక శ్రీవాణి, వార్డు సభ్యులు మల్కపురం భాస్కర్, రామగోని సరస్వతి, రాములు, మంతపురి అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలతో సామాజిక ప్రయోజనం

- సర్పంచ్ పిట్టల రవికుమార్



ఓదెల పెద్దపల్లి ఆగస్టు 03అక్షరం న్యూస్

ఓదెల మండలంలోని పిట్టల ఎల్లయ్య పల్లె గ్రామంలో సర్పంచ్ పిట్టల రవికుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి తిరిగి ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోవాలని ఇంకుడు గుంతల వల్ల సామాజిక ప్రయోజనం పొందవచ్చని అన్నారు గ్రామ కార్యదర్శి తో సహా ఇంటింటికి తిరిగి ఇంకుడు గుంతల వల్ల ప్రయోజనం ఏమిటో అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ రవికుమార్ ముదిరాజ్ మాట్లాడుతూఇంకుడు గుంతలతో ఎంతో సామాజిక ప్రయోజనం ఉందని,.. గ్రామంలో అన్ని గృహాలకు ఇంకుడు గుంతలు ఏర్పాటు సూచించారు. భవిష్యత్తు తరాలకు త్రాగునీరు అందాలంటే ఇంకుడు గుంత లే శరణ్యం అని తెలియజేశారు. ఇంకుడు గుంతలు అత్యంత ప్రాధాన్యత ఉన్నందున వాటిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకోవాలని తీర్మానించారు. ఇంకుడు గుంతలు ఒక మీటర్ లోతు, ఒక మీటర్ పొడవు, ఒక మీటర్ వెడల్పుతో అందుబాటులో ఉన్న గులక రాళ్లు, ఇతర మెటీరియల్ ఉపయోగించి తయారు చేసుకోవాలని దీనికి ఎక్కువ ఖర్చు అవసరం లేదని అన్నారు గ్రామ కార్యదర్శి అమూల్య తో పాటు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# విద్యార్థుల చేతికి విద్యా భరోసా

- గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో
- నిరుపేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ..




ఖమ్మం జిల్లా/వైరా టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లా వైరా మండలం పాలడుగు గ్రామంలోని గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీఎస్ఎస్ డేకేర్ సెంటర్‌లో సోమవారం 80 మంది నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) చావా శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గద్దల నరసింహారావు చేతుల మీదుగా స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పలకలను అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ చావా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిర్బంధ విద్యను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. చదువే భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు.అతిథులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తూ గ్రేస్ సర్వీస్ సొసైటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు తల్లిదండ్రులకు కూడా ఆర్థిక భారం కొంత మేర తగ్గుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వై. ఇమ్మానియేల్, కారుమంచి దయాకర్, సెంటర్ ఇన్‌చార్జి మోదుగు వినోద్ కుమార్, సంస్థ ప్రతినిధులు మురళి రెడ్డి, రాము, సెంటర్ సిబ్బంది నవీన్, మహబూబ్బి,మణి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం కార్యదర్శిగా మిట్టపల్లి కిరణ్ కుమార్,

•సెక్రెటరీగా యంద్రపుడీ శివశంకర్ ప్రమాణ స్వీకారం



ఖమ్మం జిల్లా/వైరా టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం కార్యదర్శిగా మిట్టపల్లి కిరణ్ కుమార్ , సెక్రెటరీగా యంద్రపుడి శివశంకర్ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించేందుకు కృషి చేసినతెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ,తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు,తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం అధ్యక్షులు సిరువ అనిల్ కు వారు కృతజ్ఞతలు తెలుపుతు పెద్దల మార్గదర్శకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్యవైశ్యుల సంక్షేమం, అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. యువతను సంఘ కార్యకలాపాల్లో మరింత భాగస్వామ్యం చేయడానికి కృషి చేస్తానని, నిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన సంఘ నాయకులు, సభ్యులు, మిత్రులకు మిట్టపల్లి కిరణ్ కుమార్ , శివశంకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# గాంధీ పార్క్ అభివృద్ధి పనులను మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ పరిశీలన



ఖమ్మం జిల్లా/ వైరా టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీ చౌక్‌లో గాంధీజీ విగ్రహం సమీపంలో కొనసాగుతున్న గాంధీ పార్క్ అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్,ఏఈ శ్రీమన్య పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ, గాంధీ పార్క్ అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విశ్రాంతి తీసుకునేలా అన్ని సౌకర్యాలతో కూడిన ఆధునిక పార్కును అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

• జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

•ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్..

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)ప్రజలు తమ సమస్యలు తెలిపి సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.ఖానాపురం హవేలీ శివారు టేకులపల్లికి చెందిన వి. వెంకటయ్య ఈ నెల తనకు వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమ కాలేదని తన బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులు జమ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే నాజియా తన కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతున్నా రని, తన కుమార్తె కు ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ, సెర్ప్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. సూర్య ప్రకాష్ పాపిరెడ్డి ఖమ్మం దేవరపల్లి హైవే ధంసలాపురం ఎంట్రీ ఎగ్జిట్ వద్ద ఉన్న తమ భూమికి దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడి ఎన్. హెచ్ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామానికి చెందిన వి. రామకృష్ణ తాను పి.జీ చదువుకున్నానని తనకు కంటికి సంబంధించిన దివ్యాంగత్వం ఉందని, తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# ముల్కనూర్‌లో 7న మెగా జాబ్ మేళా నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం




జిల్లా ప్రతినిధి మైస బాబు.. హనుమకొండ జిల్లా/
భీమదేవరపల్లి/ఆగస్టు 03/అక్షరం న్యూస్:-

నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రథమ్ అసెంచర్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 7న ముల్కనూర్ ఎస్ఆర్‌కే పాఠశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రతినిధి మైస బాబు తెలిపారు. గ్రామీణ ప్రాంత యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.కెరీర్‌ను నిర్మించడం--భవిష్యత్తును సురక్షితం చేయడం అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో టెక్నికల్, నాన్ టెక్నికల్ రంగాలకు చెందిన ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. నమోదు ప్రక్రియ పూర్తిగా ఉచితమని, ఎంపిక విధానం, అర్హతలు, శిక్షణ తదితర అంశాలపై అభ్యర్థులకు అవగాహన కల్పిస్తామని వివరించారు.గ్రామీణ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలానికి చెందిన నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9014697041ను సంప్రదించాలని సూచించారు.

# జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

•సిఐటియు జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు




జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )ఆగస్టు 03: దేశ ప్రజల హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు అన్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల సదస్సుకు రాపర్తి రాజుతో పాటు రైతు సంఘం జిల్లా అద్యక్షుడు రాపర్తి సోమయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా అనేక చట్టాలను పార్లమెంట్లో అమోదించి అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని వివ ర్శించారు. ఈ నెల 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, మహిళలు, ప్రజస్వామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పొదల నాగరాజు, పులిగిల్ల రాజు, తోటకూరి అనిల్, గం గాపుర మహేందర్, కాసాని పుల్లయ్య, కడారి ఐలయ్య, గోలనుకొండ చక్రపాణి, వెంకటయ్య, రమేష్, ఎల్లయ్య, సురేందర్, గణేష్, యాదగిరి, వెంకటనర్సు, వీరస్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంట్లో వేడి పెరిగి చాలా ఇబ్బందిగా ఉందా.. ఈ టిప్స్ మీ కోసమే..!

ఎండాకాలం వచ్చిందంటే చాలు ఎండలు మండిపోతాయి. ఈ ఎండలవల్ల నిత్యం శరీర ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. శరీరం డీహైడ్రేట్ అవుతుంది. దాంతో తరచూ ఒళ్లు అలసిపోయి నీరసం ఆవహిస్తుంది. ఏం చేయాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. శరీరం సహకరించదు. అలాంటి పరిస్థితి రావద్దంటే శరీరాన్ని డీహైడ్రేట్ కాకుండా కాపాడుకోవాలి. శరీర ఉష్ణోగ్రతలు పెరుగకుండా చూసుకోవాలి. అందుకోసం కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే సరిపోతుంది. మరి ఆ చిట్కాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..

1. రోజూ రెండు కప్పుల తాటి బెల్లం కలిపిన నీళ్లను తాగడం ద్వారా శరీరంలో వేడిని తగ్గించుకోవచ్చు.

2. ప్రతి రోజూ క్రమం తప్పకుండా నిమ్మ రసం, కొబ్బరి నీళ్లు తాగడం ద్వారా కూడా శరీరంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోయి చల్లబడుతుంది.

3. అదేవిధంగా రోజూ ఉదయం కొబ్బరి నూనె లేదా పొద్దు తిరుగుడు నూనెతో శరీరానికి మర్ధన చేసుకుని స్నానం చేయడంవల్ల కూడా ఒంట్లో వేడి తగ్గుతుంది.

4. క్రమం తప్పకుండా ఎర్ర మందారం టీ తాగడంవల్ల కూడా శరీర ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

5. కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగడం ద్వారా కూడా శరీరంలో వేడిని తగ్గించుకోవచ్చు.

6. అంతేగాక మెంతులను వేయించి, పొడిచేసి రోజూ గోరు వెచ్చటి నీటితో కలిపి తాగడం ద్వారా కూడా ఒంట్లో వేడిని తగ్గించుకోవచ్చు.

7. సోంపు, జీలకర్ర, ధనియాలు రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు తాగడంవల్ల కూడా ఒంట్లో వేడి తగ్గుతుంది.

8. దానిమ్మ గింజల్లో కూడా శరీరంలోని వేడిని తగ్గించే లక్షణం ఉంది. రెండు మూడు రోజులకు ఒకసారైనా దానిమ్మ గింజలు తినడం లేదా దానిమ్మ రసం తాగడంవల్ల శరీరం చల్లగా ఉంటుంది.

9. అదేవిధంగా వేడిచేసే ఆహార పదార్థాలైన పుల్లటి పండ్లు, బీట్‌రూట్‌లు, క్యారెట్‌లను వేసవిలో ఎక్కువగా తినకుండా ఉండటం ద్వారా కూడా శరీర ఉష్ణోగ్రతలను అదుపులో పెట్టుకోవచ్చు.

# దేశంలో ఏటా పెరిగిపోతున్న కిడ్నీ వ్యాధులు..

• 30 ఏళ్ల నుంచే పరీక్షలు తప్పనిసరి అంటున్న నిపుణులు..

మూత్రపిండాల ఆరోగ్యం సాధారణంగా తీవ్ర లక్షణాలు కనిపించే వరకు నిర్లక్ష్యానికి గురవుతుంటుంది. అయితే ప్రస్తుతం దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిభారత్‌లో ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. ఇతర వ్యాధులతో పోలిస్తే కిడ్నీ సమస్యలు చాలా కాలం వరకు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండా మెల్లగా అభివృద్ధి చెందుతాయి. లక్షణాలు బయటపడే సమయానికి కిడ్నీలకు గణనీయమైన నష్టం జరిగే అవకాశం ఉంటుంది. అందుకే 30 ఏళ్ల వయస్సు నుంచే కిడ్నీ ఆరోగ్య పరీక్షలు ప్రారంభించడం అత్యంత కీలకమని వైద్యులు చెబుతున్నారు. భారత్‌లో కిడ్నీ వ్యాధుల భారం వేగంగా పెరుగుతోంది. తాజా పరిశోధనల ప్రకారం 2011-2017 మధ్య కాలంలో సుమారు 11 శాతం ఉన్న జఖణ ప్రబలత 2018-2023 మధ్య కాలంలో 16 శాతానికి పైగా పెరిగింది. ఇది పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో సూచిస్తోంది. ఈ పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయి. వేగవంతమైన పట్టణీకరణ, కూర్చునే జీవనశైలి, అసమతుల ఆహారం, పెరుగుతున్న స్థూలకాయం కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తున్నాయి. అదనంగా, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ కేసులు భారత్‌లో అధికంగా ఉండటం కూడా కిడ్నీ నష్టానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

## ముందే పరీక్షలు చేయించడం మంచిది..

కిడ్నీ వ్యాధులలో అత్యంత ప్రమాదకర అంశం ఏంటంటే, ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. చాలా మంది తమ కిడ్నీ పనితీరు క్రమంగా తగ్గిపోతున్నదని తెలియకుండా సాధారణ జీవితం కొనసాగిస్తుంటారు. అందువల్ల ముందస్తు గుర్తింపు అత్యంత అవసరం. గతంలో కిడ్నీ వ్యాధులను వృద్ధులకు మాత్రమే సంబంధించిన సమస్యగా భావించేవారు. అయితే ప్రస్తుతం ఈ ధోరణి మారుతోంది. 30లు, 40ల్లో ఉన్నవారిలో కూడా కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయి. ఇది ముందస్తుగా వచ్చే డయాబెటిస్, రక్తపోటు, స్థూలకాయం వంటి సమస్యలతో సంబంధం కలిగి ఉంది. ఈ వ్యాధులు నియంత్రణలో లేకపోతే కిడ్నీలలోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతింటాయి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలను, అదనపు ద్రవాన్ని తొలగించే కిడ్నీల సామర్థ్యం తగ్గిపోతుంది.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




• ఆగస్టు 8లోగా అన్ని శాఖలు నివేదికలను డీపీఆర్వోకు అందజేయాలి

• ప్రతి శాఖ నుంచి ఉద్యోగుల పేర్లను ప్రశంసాపత్రాలకు ప్రతిపాదించాలి

• మినిట్ టు మినిట్ వారీగా కార్యక్రమాన్ని ముందుగానే ఖరారు చేయాలి

• స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ముఖ్య అతిథి ప్రసంగాన్ని ఆగస్టు 11 నాటికి సిద్ధం చేయాలని తెలిపారు. ప్రతి శాఖ తమ శాఖలో చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలను సంక్షిప్తంగా పొందుపరిచిన నివేదికలను ఆగస్టు 8 లోగా డీపీఆర్వోకి అందజేయాలని ఆదేశించారు. సౌండ్ వ్యవస్థ ఏర్పాట్ల బాధ్యతను ఖమ్మం అర్బన్ తహసీల్దార్ చేపట్టాలని, సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లను డీపీఆర్వో ముందస్తుగా పరిశీలించి నిర్ధారించాలని సూచించారు.ప్రతి శాఖ నుంచి ప్రశంసా పత్రాల కోసం ఇద్దరు ఉద్యోగుల పేర్లను మాత్రమే ప్రతిపాదించాలని, వారి సేవా చరిత్ర మంచిగా ఉండాలని స్పష్టం చేశారు. వేదికపై జరిగే ప్రతి కార్యక్రమాన్ని మినిట్ టు మినిట్ వారీగా కార్యక్రమ పట్టికలో పొందుపరిచి ముందుగానే ఖరారు చేయాలని, కార్యక్రమ వ్యాఖ్యాతకు పూర్తి కార్యక్రమంపై ముందస్తుగా అవగాహన కల్పించాలని సూచించారు.ముఖ్య అతిథి రాకముందే అందరూ తమ స్థానాల్లో కూర్చునేలా చూడాలని ఆదేశించారు. స్టాల్స్‌ను ఆగస్టు 15 ఉదయం 6 గంటలకల్లా సిద్ధం చేయాలని,సాంస్కృతిక కార్యక్రమాల్లో వినిపించే పాటలను ముందుగానే ఎంపిక చేసి ఒక్కో పాట మూడు నుంచి నాలుగు నిమిషాలకు మించకుండా చూడాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తాజా నివేదికలతో వేడుకలకు హాజరు కావాలని తెలిపారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ఆహ్వానితులకు ప్రోటోకాల్ ప్రకారం జిల్లా రెవెన్యూ అధికారి ద్వారా ఆహ్వానాలు పంపించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం మైదానం సిద్ధం చేయాలని, టెంట్లు, టేబుళ్లు, కుర్చీలు తదితర ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.వ్యవసాయం, అనుబంధ శాఖలు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ, ఉద్యాన, పశు సంవర్ధక, తదితర శాఖలు అభివృద్ధి ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అవసరమైన ఏర్పాట్లను తహసీల్దార్ చేపట్టాలని సూచించారు.ప్రశంసా పత్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఆగస్టు 12 లోగా పంపించాలని, అగ్నిమాపక వాహనం సిద్ధంగా ఉంచాలని, అవసరమైన మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే పాఠశాల విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌళిక వసతులు కల్పించాలి

- •రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత
- •జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- •ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద రూ.3.62 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన..
- •ఖమ్మం నగర భవిష్యత్ అవసరాలకు 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలి..
- •భూమి కేటాయింపు పూర్తికాగానే పనులు ప్రారంభించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి.



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

రానున్న పదేళ్లలో ఖమ్మం నగరం మరింత విస్తరించనున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌళిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.సోమవారం రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద నూతనంగా రూ.3.62 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధి వేగంగా జరుగుతున్న నేపథ్యంలో రాబోయే విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. రానున్న పదేళ్ల అవసరాలను అంచనా వేసి అదనపు విద్యుత్ ఉపకేంద్రాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం ఖమ్మం నగరానికి 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం అత్యవసర అవసరమని పేర్కొన్న మంత్రి, ఉపకేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూమిని వెంటనే గుర్తించి, ఎక్కడ నిర్మించాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. స్థల ఎంపిక, అంచనా వ్యయం, సాంకేతిక ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి తక్షణమే పంపించాలని ఆదేశించారు.కొత్తగా ప్రతిపాదించే విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలని, భూమి కేటాయింపు పూర్తికాగానే శంకుస్థాపన చేసి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన వారే కావడంతో అవసరమైన పరిపాలనా, ఆర్థికపరమైన అనుమతులు త్వరితగతిన లభిస్తాయని అన్నారు.జిల్లా కలెక్టర్ స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల నుంచి అవసరమైన అనుమతులు, ఎన్‌ఓసీలు సకాలంలో జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.విద్యుత్ మౌళిక వసతుల అభివృద్ధి ద్వారా ఖమ్మం నగర భవిష్యత్ అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీఓ శ్రీనివాస్, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- •ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు
- •మొదటి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారం
- •తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించాలి
- •తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం జిల్లా/ ఖమ్మం టౌన్ ఆగస్టు 3 (అక్షరం న్యూస్)

ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ ఆహారమని తెలిపారు. శిశువు పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే పట్టించేలా ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఆరు నెలల కాలంలో శిశువు ఎదుగుదల, అభివృద్ధికి, రోగ నిరోధక శక్తికి అవసరమైన అన్ని పోషకాలు తల్లిపాలలోనే లభిస్తాయని అన్నారు.ఎక్స్‌క్లూజివ్ బ్రెస్ట్ ఫీడింగ్ అంటే బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర ఆహారం లేదా పానీయం ఇవ్వక పోవడమేనని తెలిపారు. ఈ కాలంలో నీరు, పైపాలు, పాలపొడి లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వడం వల్ల శిశువుకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని, వైద్యుల సూచన లేకుండా పాల పొడి లేదా డబ్బా పాలను వినియోగించరాదని సూచించారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి, ప్రాజెక్టు స్థాయి, అంగన్‌వాడీ కేంద్రాల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తూ ప్రతి శిశువుకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు, గర్భిణులు బాలింతలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి ఎ. ప్రమీల, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, పోషణ్ అభియాన్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పిట్టలగూడెంలో రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )ఆగస్టు, 03: మండలంలోని భాంజీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని పిట్టలగూడెంలో రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ గైని శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఇంతకు ముందు పిట్టలగూడెంకు చెం దిన వారు రేషన్ బియ్యం కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బాంజీపేటకు వెళ్లేవారు. రేషన్ బియ్యం కోసం పిట్టలగూడెం వాసులు మూడు కిలోమీటర్ల దూరం రావాల్సి వస్తున్న విషయాన్ని పంచాయతీ పాలకవర్గం తహసీల్దార్, ఆర్డీవో దృష్టికి తీసుక వెళ్లగా స్పందించిన వారు పిట్టలగూడెంలోనే రేషన్ బియ్యం పంపిణీ చేసేటట్లు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాట్ల శ్రీనివాస్, వార్డు మెంబర్లు పగిడిపల్లి ఇంద్ర, కె.మహేందర్, రేషన్ డీలర్ శివరాత్రి రామచం ద్రం. గోపాల్. రాజు తదితరులు పాల్గొన్నారు.

## 35 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకా

- • అపోహలు వీడి హెచ్‌పీవీ టీకా వేయించండి
- •తల్లిదండ్రులకు విజ్ఞప్తి.
- • డాక్టర్ రూబీనా



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఆగస్టు 03/అక్షరం న్యూస్:-

గర్భాశయ ముఖద్వార (సర్వికల్) క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం చేపట్టిన హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్నిహనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోనిసోమవారం పి.వి. రంగారావు గురుకుల పాఠశాలలో నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో 14--15 సంవత్సరాల వయస్సు గల 35 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకా వేశారు.ఈ సందర్భంగా డాక్టర్.రూబీనా విద్యార్థినులకు సర్వికల్ క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ టీకా ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమెమాట్లాడుతూనేడు వేసే టీకా భవిష్యత్తులో ఆరోగ్య రక్షణకు దోహదపడుతుందని వివరించారు. 14--15 సంవత్సరాల వయస్సు గల బాలికల తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా సమీప ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా అందిస్తున్న హెచ్‌పీవీ టీకాను తప్పనిసరిగా వేయించాలని సూచించారు.కార్యక్రమంలో డా. రూబీనా, డా. రహ్మాన్, సూపర్వైజర్ వాణి, మోహన్, స్టాఫ్ నర్స్ అరుంధతి, ఏఎన్ఎంలు స్వరూప, లత, ఆశా కార్యకర్త అజిత, పాఠశాల ప్రిన్సిపాల్ అఫ్రీన్, భార్గవి మేడం, హారిక స్టాఫ్ నర్స్ తదితరులు పాల్గొన్నారు.

## భూముల సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలి

- • తహసీల్దార్ బి. రాజేష్..
- • ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు సూచన.



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ ఆగస్టు 03/అక్షరం న్యూస్:-

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని మండల తహశీల్దారు బి. రాజేష్ కోరారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన భూముల రీ సర్వేపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.భూముల రీ సర్వే ద్వారా ప్రతి భూమికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా భూ వివరాలు నమోదు చేయబడతాయని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో భూ సరిహద్దులపై తలెత్తే వివాదాలకు అడ్డుకట్ట పడటంతో పాటు భూ యజమానుల హక్కులకు మరింత రక్షణ కలుగుతుందన్నారు.రైతులు సర్వే బృందాలు గ్రామాలకు వచ్చినప్పుడు తప్పకుండా హాజరై తమ భూములను చూపించాలని పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, సంబంధిత భూ పత్రాలు వంటి అవసరమైన రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని అపోహలు నమ్మకుండా అధికారుల సూచనల మేరకు వ్యవహరించాలని కోరారు.ప్రభుత్వం పారదర్శకంగా రీ సర్వే నిర్వహిస్తోందని రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యమని తహసీల్దార్ తెలిపారు. ప్రతి భూ యజమానికి న్యాయం జరిగేలా అధికారులు కృషి చేస్తున్నారని ప్రజల సహకారంతోనే రీ సర్వే విజయవంతమవుతుందని అన్నారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీధర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియదశలు, భూ వివరాల నమోదు విధానం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాచర్ల కుమార్ స్వామి, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్‌కు రిలీఫ్

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియామాజీ చీఫ్, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో భారీ ఊరట లభించింది. ఆరుగురు మహిళా రెజ్లర్ల ఫిర్యాదు మేరకు నమోదైన లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌తోపాటు.. డబ్ల్యూఎఫ్ఐ అసిస్టెంట్ సెక్రటరీగా పని చేసిన వినోద్ తోమర్‌లను ఢిల్లీ న్యాయస్థానం నిర్దోషులుగా తేల్చింది. ఢిల్లీ రోజ్ అవెన్యూ కోర్టులో అడిషనల్ చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ అశ్వినీ పన్వార్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో వాదనలు విన్న న్యాయస్థానం గురువారం తన తుది తీర్పును రిజర్వ్ చేసింది. మహిళా రెజ్లర్ల ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు బ్రిజ్ భూషణ్‌పై 2023 జూన్ 15న ఛార్జ్‌షీట్ నమోదు చేశారు. ఐపీసీ 354, 354ఏ, 354డీ, 506 సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది. 2024 మే నెలలో బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపులు, నేరపూరిత బెదిరింపుల కింద అభియోగాలు నమోదు చేయాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. అయితే ఆరుగురు ఫిర్యాదుదారుల్లో ఒకరు చేసిన ఆరోపణల నుంచి ఆయనకు విముక్తి కల్పించింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌పైనా అభియోగాలు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది.

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

•ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో రాస్తారోకో.



పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / ఆగస్టు 03 / అక్షరం న్యూస్ –:

ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మారం సందీప్, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లకు చేరాయని, నిధులు విడుదల కాక వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎస్ రాష్ట్ర కన్వీనర్ ఓమేష్, నగర కార్యదర్శి అరవింద్, నగర ఉపాధ్యక్షుడు విగ్నేష్, నాయకులు సిద్ధార్థ్, శివ, దినేష్, కార్తీక్, శైలజ, మౌనికతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి




పెద్దపల్లి జిల్లా / పెద్దపల్లి టౌన్ / ఆగస్టు 03 / అక్షరం న్యూస్ –:

పెద్దపల్లి సర్కిల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ కాంట్రాక్టర్ ఏ. కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చెప్పాల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం. సుధాకర్, కోశాధికారిగా ఎన్. రాజిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా వి. శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రాధయ్య, పిల్లి రాజు, ఎస్. గురువయ్య, గుమ్మడి అంజయ్య, డి. స్రవంతి, ఎం. శంకర్ తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# మణుగూరు పీకే బ్లాక్ సింగరేణికి దక్కడం హర్షణీయం

- ఐక్య పోరాటాలతోనే బొగ్గు గనుల ప్రైవేటీకరణకు అడ్డుకట్ట.
- సంస్థ మనుగడ, కార్మికుల భవిష్యత్తు కోసం నిరంతర కృషి.
- కొత్త బొగ్గు బ్లాకుల సాధనకు ఉద్యమాలు తీవ్రతరం చేస్తాం.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం/కొత్తగూడెం / ఆగస్టు 3 / అక్షరం న్యూస్–: మణుగూరు పీకేఓసి డిప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించడం ప్రభుత్వంపై తాను చేసిన వత్తిడి, కార్మికుల ఐక్య పోరాటాల ఫలితమేనని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి గుర్తింపుసంఘం గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పీకేఓసి డిప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు అప్పగిస్తూ నిర్ణయం జరగడంపట్ల అయన హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి పరిరక్షణ కోసం, సంస్థ మనుగడ కోసం చేపట్టిన వరుస ఆందోళనల వల్లే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పేర్కొన్నారు. పీకేఓసి డిప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికి దక్కేలా చూసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలతో పలుమార్లు చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అలాగే సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన దశలవారీ ఉద్యమాలు, ఆందోళనలు ఈ విజయంలో కీలక పాత్ర పోషించాయని చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు కార్మిక లోకం ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి ఆస్తులను, గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు జరిగిన కుట్రలను ఉద్యమ స్ఫూర్తితో తిప్పికొట్టామని స్పష్టం చేశారు. లాభాల బాటలో ఉన్న సింగరేణిని దెబ్బతీసే యత్నాలను ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఈ విజయాన్ని కొందరు తమ గొప్పగా ప్రచారం చేసుకోవడం తీవ్ర హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు దక్కే వరకు తమ పోరాటం ఆగేది లేదని, సంస్థ ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

# జగన్నాథపురంలో అంజునా ఫార్మసీ ప్రారంభం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ములకలపల్లి /ఆగస్టు 3/అక్షరం న్యూస్ –:
?ములకలపల్లి,మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంజునా ఫార్మసీ స్టోర్ ను సోమవారం స్థానిక సర్పంచ్ కుంజా వినోద్ ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ వైద్యులు సుభాని కుమారుడు అనీద్ ఈ ఫార్మసీని ఏర్పాటు చేశారు.? ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ... వ్యాపార సంస్థను దిగ్విజయంగా నడుపుతూ, స్థానిక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నాణ్యమైన మందులను అందజేయాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని అన్నారు. ?ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు, ఉమ్మడి జగన్నాథపురం గ్రామ ప్రజలు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం: సర్పంచ్ కుంజా వినోద్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ ఆగస్టు 3/ అక్షరం న్యూస్ –:
ఆగస్టు 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ పిలుపునిచ్చారు. సోమవారం వేడుకల నిర్వహణ కోసం మండల, పంచాయతీ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ వేడుకలను నిర్వహించాలన్నారు. వేడుకలకు ప్రజలు, యువత, ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు సమిష్టిగా సహకరించి ఐక్యతను చాటాలని కోరారు.?ఈ కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా కార్యదర్శి పాయం నరసింహారావు, సీనియర్ నాయకులు మీడియం నారాయణ, కోడిమీ వెంకటేష్, సున్నం చిన్నరాజు, మడకం సురేష్, మడకం సిరిమప్ప, కారం సుధీర్ బాబు, మడకం శ్రీనివాస్, కురం రామకృష్ణ, ఇర్పా ప్రసాద్, కీసరి ప్రకాష్, పూణెం వెంకటేష్, సున్నం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త కుప్పలుగా మారుతున్న శంకరపల్లి పరిసర ప్రాంతాలు

- శంకర్పల్లి కనీస బాధ్యతను మరిచిన ప్రవాస శంకర్పల్లి వాసులు.

సాయంత్రం 7 అయితే చాలు శంకర్పల్లి మొత్తం చెత్తకుప్పలమయం.

రంగారెడ్డి జిల్లా :శంకర్పల్లి : ఆగస్టు 3: అక్షరం న్యూస్ శంకర్పల్లి మున్సిపాలిటీ ఇంటి ముందుకు చెత్త బండి వస్తున్న బండిలో చెత్త వేయని దయనీయ పరిస్థితి

శంకర్పల్లిని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దాలంటే ప్రజల సహకారం తప్పనిసరి. సంక్రాంతి సందర్భంగా ఒకసారి మాత్రమే ఇంటి ముందు గొబ్బెమ్మలు వేసి పండుగ వాతావరణాన్ని సృష్టించే ప్రజలు, కొన్నిచోట్ల మాత్రం ప్రతిరోజూ రాత్రివేళ రోడ్ల పక్కనే చెత్త కుప్పలు వేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నప్పటికీ, కొందరు చెత్త బండి వచ్చినా అందులో వేయకుండా ప్లాస్టిక్ సంచుల్లో కట్టి రాత్రి వేళల్లో రోడ్ల పక్కన, వీధుల చివరల్లో, ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. ఉదయం అయ్యేలోపే వీధి కుక్కలు వాటిని చింపివేయడంతో చెత్త రోడ్లంతా వ్యాపించి అసహ్యకరంగా మారుతోంది.వర్షాకాలం కావడంతో ఈ చెత్తలోని ప్లాస్టిక్ సంచులు డ్రైనేజీల్లో చేరి మురుగునీటి ప్రవాహాన్ని



అడ్డుకుంటున్నాయి. ఫలితంగా డ్రైనేజీలు పొంగిపొర్లి మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. చెత్త నుంచి వచ్చే దుర్వాసన, దోమల పెరుగుదల, అంటువ్యాధుల ముప్పు ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది.

ముఖ్యంగా చెత్త కుప్పల సమీపంలోని వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన కారణంగా కస్టమర్లు దుకాణాల వద్ద ఎక్కువసేపు ఉండకుండా వెళ్లిపోతున్నారని వారు వాపోతున్నారు.ఒకవైపు "మున్సిపల్ అధికారులు చెత్త తొలగించడం లేదు" అంటూ ఫిర్యాదులు చేస్తున్న కొందరు, మరోవైపు తమ ఇంటి చెత్తను రోడ్లపైనే వేయడం పరిస్థితిని మరింత దిగజారుస్తోందని స్థానికులు అంటున్నారు.స్థానికులు, అధికారులు కలిసి పనిచేస్తేనే "క్లీన్ శంకర్పల్లి -- గ్రీన్ శంకర్పల్లి" లక్ష్యం సాకారం అవుతుందని అభిప్రాయపడుతున్నారు. ప్రజలు చెత్తను తప్పనిసరిగా మున్సిపల్ చెత్త బండికే అందజేయాలని, రోడ్లపై పడేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాలపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు."పరిశుభ్రమైన శంకర్పల్లి... అందమైన శంకర్పల్లి" అనేది ప్రతి ఒక్కరి బాధ్యతతోనే సాధ్యమవుతుంది.

# టీమిండియా సరికొత్త టెస్ట్ మిషన్

- ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంక పర్యటన
- ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసుపై దృష్టి



జింబాబ్వే పర్యటన తర్వాత భారత జట్టుకు కొన్ని రోజుల పాటు విరామం దొరికింది. ఈ బ్రేక్ అనంతరం భారత క్రికెట్ జట్టు మళ్లీ సుదీర్ఘ ఫార్మాట్‌పై దృష్టి సారించింది. ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంక పర్యటనతో టీమిండియా సరికొత్త టెస్ట్ మిషన్‌ను ప్రారంభించనుంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నాయకత్వంలోని భారత జట్టుకు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్ అత్యంత కీలకంగా మారింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉన్న భారత్ ఖాతాలో ఇంకా తొమ్మిది టెస్టులు మిగిలి ఉన్నాయి. ఇందులో శ్రీలంకతో 2 టెస్టులు, న్యూజిలాండ్ పర్యటనలో 2 టెస్టులు, ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే 5 టెస్టుల సిరీస్ ఉన్నాయి. ఈ తొమ్మిది మ్యాచ్‌లలో కనీసం 7 నుంచి 8 మ్యాచ్‌లు గెలిస్తేనే టాప్-2లో నిలిచి ఫైనల్ అర్హత సాధించే అవకాశాలు సజీవంగా ఉంటాయి. ప్రస్తుతం ఈ రేసులో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లు ముందంజలో ఉన్నాయి.కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గంభీర్ నేతృత్వంలోని టీమిండియా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా సిరీస్‌లలో ఓటములను చవిచూసింది. దీంతో ఆయన కోచింగ్ సామర్థ్యంపై పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అంశంపై భారత మాజీ వికెట్ కీపర్, వ్యాఖ్యాత దీప్ దాస్‌గుప్తా స్పందిస్తూ.. గంభీర్‌కు ఇది నిప్పులాంటి పరీక్ష అని వ్యాఖ్యానించారు."జట్టు ఆశించిన స్థాయిలో రాణించనప్పుడు హెడ్ కోచ్, కెప్టెన్, మేనేజ్‌మెంట్‌ను ప్రశ్నించడం సహజం. 2011-12 తర్వాత మనం స్వదేశంలో సిరీస్ కోల్పోవడమే కాకుండా, న్యూజిలాండ్‌తో వరుస ఓటములను చూశాం. గత మూడు సిరీస్‌లలో రెండింటిని కోల్పోయాం కాబట్టి ఒత్తిడి ఉండటం ఖాయం. అయితే గంభీర్, శుభ్‌మన్ గిల్‌లతో పాటు భారత ఆటగాళ్లకు ఒత్తిడిని ఎలా జయించాలో బాగా తెలుసు" అని ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దాస్‌గుప్తా పేర్కొన్నారు. జట్టులో జరుగుతున్న మార్పులపై దాస్‌గుప్తా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. "న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్ నుంచి జట్టులో మార్పుల ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఈ మార్పులు ఏ దిశగా సాగుతున్నాయనే దానిపై నాకు కాస్త అయోమయం ఉంది. జట్టు ప్రయాణిస్తున్న తీరుపై స్పష్టమైన అవగాహన కనిపించడం లేదు" అని ఆయన అన్నారు.ముందున్న కఠినమైన పర్యటనల గురించి హెచ్చరిస్తూ.. "ప్రస్తుత పరిస్థితుల్లో టీమిండియాకు ఏ టెస్టు సిరీస్ కూడా తేలికైంది కాదు. ముఖ్యంగా శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనలు ఎల్లప్పుడూ సవాల్‌తో కూడుకున్నవే. మిగిలిన 9 టెస్టుల్లో కనీసం 7 మ్యాచ్‌లు గెలవడం అంత సులభం కాదు. గత మూడు సిరీస్‌లలో రెండింటిని కోల్పోయిన నేపథ్యంలో ఏ ప్రత్యర్థినీ, ఏ పరిస్థితినీ తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు" అని దాస్‌గుప్తా ముగించారు.

# అతీంద్రియ శక్తుల కథ...అగధ

- 14 రిలీజ్‌కు రెడీ అవుతున్న చిత్రం



ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది.ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది? దాని గురించి నాకు తెలియాలి' అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

- ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా
- 19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్



హైదరాబాద్,ఆగస్ట్3 తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ పక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## కర్నాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

- 20 మంది కొత్త మంత్రుల ప్రమాణం
- చోటు దక్కని పలువురు ఎమ్మెల్యేల ఆగ్రహం
- అసమ్మతి నేతల ఆందోళనలు..ధర్నాలు
- ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ రాజీనామా

బెంగళూరు,ఆగస్టు 3 కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ రాష్ట్ర కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఆగ్రహావేశాలు, ఆనందోత్సాహాలను చవిచూడాల్సి వచ్చింది. కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది.

కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అతన్ని ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లి

పరామర్శించారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతుదారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు. అసమ్మతి నేతల రహస్య భేటీ: హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు.

మంత్రి మునియప్ప అసంతృప్తి: మరోవైపు సీనియర్ నేత, కేబినెట్ మంత్రి కె.హెచ్. మునియప్ప కూడా తన శాఖ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాఖను మార్చాలని కోరుతున్నట్లు సమాచారం.

ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందు కేబినెట్ జాబితాలో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన ముసాయిదా నుంచి మంకాల్ వైద్య, గాయత్రి చంద్రశేఖర్‌లను తొలగించి, ఆఖరి నిమిషంలో సీనియర్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. కర్ణాటక కాంగ్రెస్ విస్తరణపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ చెబుతున్న సామాజిక న్యాయం, మహిళా సాధికారత మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. కేబినెట్‌లో ఏకైక మహిళకే చోటు ఇవ్వడం, బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బి. నాగేంద్ర, జమీర్ అహ్మద్ ఖాన్‌లను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడం కాంగ్రెస్ డొల్లతనాన్ని బయటపెడుతోందని ఆరోపించారు.

## అధికార బిజెపికి వరుస దెబ్బలు

### మధ్యప్రదేశ్, బీహార్ ఉప ఎన్నికల్లో అభ్యర్థుల ఓటమి

### గుజరాత్‌లో మాత్రం గెలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 3: భారతీయ జనతా పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పేపర్ లీకేజీల వివాదంపై నిరసనల నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన పరిణామం మరవకముందే..బీజేపీ పాలిత రాష్ట్రాలైన బిహార్, మధ్యప్రదేశ్ ఉపఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైంది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే ఉపఎన్నికల్లో మొగ్గు ఉండే ఆనవాయితీకి భిన్నంగా బిహార్‌లోని బంకీపూర్, మధ్యప్రదేశ్‌లోని దతియా స్థానాల్లో బీజేపీ ఓటమి పాలవడం కమలదళాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అయితే గుడ్డిలో మెల్లలా గుజరాత్ మంజల్‌పూర్ స్థానాన్ని గెలుచుకుని పరువు దక్కించుకుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజీనామాతో ఖాళీ అయిన బంకీపూర్ స్థానం బీజేపీకి దశాబ్దాలుగా బలమైన కోట. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి 50,000 పైచిలుకు మెజారిటీ సాధించిన బీజేపీకి ఈసారి గట్టి షాక్ తగిలింది. రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిశోర్ (జన్ సురాజ్ పార్టీ) బంకీపూర్ స్థానంలో విజయం సాధించి, బిహార్ శాసనసభలో తొలిసారి ఖాతా తెరిచారు. బీజేపీ ఓటు బ్యాంక్ ఏకంగా మూడోవంతుకు పడిపోయింది. నీట్ పేపర్ లీక్ ఆందోళనలు, యూజీసీ గైడ్‌లైన్స్, స్థానిక విద్యార్థుల నిరసనలు, పోలీసుల చర్యల వల్ల యువత, బీజేపీ సాంప్రదాయ ఓటర్లు దూరమవ్వడమే కాక, పోలింగ్ శాతం గణనీయంగా తగ్గడం ఓటమికి ప్రధాన కారణమైంది. గతంలో 46,000 ఓట్లు సాధించిన ఆర్‌జేడీ అభ్యర్థి రేఖా గుప్తా కూడా ఈసారి 15,000 ఓట్లకు పరిమితమయ్యారు.

# ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి

### మణుగూరు పీకేఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కడం చారిత్రక విజయం: భట్టి విక్రమార్క



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 3 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సింగరేణి సంస్థ పరిరక్షణ, విస్తరణతో పాటు తెలంగాణ ఇంధన భద్రతను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం చారిత్రక విజయమని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణికి కొత్త బొగ్గు బ్లాక్‌లు దక్కేలా ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. అదే కృషి ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని చెప్పారు.ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌కు అనుమతులు సాధించేందుకు స్వయంగా అక్కడికి వెళ్లి ప్రజాప్రతినిధులు, స్థానికులను ఒప్పించినట్లు తెలిపారు. దీంతో 36 ఏళ్లపాటు సింగరేణికి ఉపయోగపడే నైనీ బొగ్గు గనిలో ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. అలాగే గత నెలలో తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు కూడా ప్రభుత్వం సాధించిందని చెప్పారు. ఈ గనిలో 336 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా, 45 సంవత్సరాల పాటు బొగ్గు ఉత్పత్తికి అవకాశం ఉందన్నారు.మణుగూరు పీకేఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం గత 12 ఏళ్లలో వేలం ద్వారా సంస్థకు లభించిన తొలి బ్లాక్ అని తెలిపారు. గత ప్రభుత్వం సింగరేణిని వేలంలో పాల్గొనకుండా చేసి రాష్ట్రంలోని విలువైన బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లే పరిస్థితి తీసుకువచ్చిందని విమర్శించారు.

ఈ బ్లాక్‌లో 120 మిలియన్ టన్నుల జీ-8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 సంవత్సరాల పాటు బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా తెలంగాణ విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలికంగా బొగ్గు సరఫరా సాధ్యమవుతుందని పేర్కొన్నారు.మణుగూరు ఏరియా భవిష్యత్తుకు ఈ బ్లాక్ కీలకమని, సుమారు రెండు వేల మంది కార్మికులకు ఉపాధి భద్రత కల్పించడంతో పాటు స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని చెప్పారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కోయగూడెం-3, సత్తుపల్లి-3 బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లిపోయాయని ఆరోపించారు. వాటిని కూడా తిరిగి సింగరేణికి దక్కేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణిని మరింత బలోపేతం చేయడం, కొత్త బొగ్గు నిల్వలను సంస్థకు అందించడం, ఉద్యోగ భద్రత పెంపొందించడం, రాష్ట్ర విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలిక బొగ్గు సరఫరా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

మణుగూరు పీకేఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్ దక్కించుకున్న సందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాల్లోనూ బొగ్గు గనుల సాధనతో పాటు కీలక ఖనిజాల అన్వేషణలో సింగరేణి విస్తరించేలా కార్యాచరణ చేపడుతున్నట్లు వెల్లడించారు

# ఇసుక మాఫియా ఇష్టారాజ్యం నిద్రమత్తులో అధికార యంత్రాంగం



- మీడియా ముసుగులో మాఫియాకు అండ
- పోలవరం--కొవ్వూరు ర్యాంపుల నుంచి అశ్వారావుపేట మీదుగా యథేచ్ఛగా అక్రమ రవాణా
- నిత్యం లక్షల రూపాయల దందా.. నిద్రమత్తులో అధికార యంత్రాంగం!

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / ఆగస్టు 3 / అక్షరం న్యూస్ :-అశ్వారావుపేట సరిహద్దు పాంతంలో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పోలవరం, కొవ్వూరు ఇసుక ర్యాంపుల నుంచి భారీగా లోడ్ చేసిన టిప్పర్లు అశ్వారావుపేట మీదుగా తెలంగాణలోకి ప్రవేశిస్తున్నప్పటికీ, అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ దందాకు కొందరు మీడియా ప్రతినిధులు కూడా అండగా నిలుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఉచిత ఇసుక విధానాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ వ్యాపారం?

ఆంధ్రప్రదేశ్‌లో అమలులో ఉన్న ఉచిత ఇసుక విధానాన్ని కొందరు అక్రమార్కులు తమ అక్రమ సంపాదనకు మార్గంగా మార్చుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలవరం, కొవ్వూరు ర్యాంపుల నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు పాపిడిగూడెం, పేటమాలపల్లి, రాచన్నగూడెం, జీలుగుమిల్లి జాతీయ రహదారి మీదుగా అశ్వారావుపేట సరిహద్దు దాటి తెలంగాణలోకి చేరుతున్నాయని చెబుతున్నారు. ఒక్కో టిప్పర్‌లో 35 నుంచి 40 టన్నుల వరకు ఇసుకను తరలిస్తూ, ఒక్కో ట్రిప్‌పై సుమారు రూ.40 వేల వరకు అక్రమ లాభాలు పొందుతున్నట్లు సమాచారం. ప్రతిరోజూ పదుల సంఖ్యలో టిప్పర్లు రాకపోకలు సాగిస్తూ నెలకు కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### మీడియా ముసుగులో మాఫియాకు రక్షణ కవచం

సమాజంలో అక్రమాలను వెలుగులోకి తేవాల్సిన బాధ్యత కలిగిన కొందరు మీడియా ప్రతినిధులే ఇసుక మాఫియాకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. జర్నలిజం ముసుగులో అక్రమ రవాణాకు సహకరిస్తూ, మాఫియాకు రక్షణ కల్పిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిజాలను వెలికితీయాల్సిన కలం కొందరి చేతుల్లో కాసుల కోసం అమ్ముడుపోతోందన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

### అధికార యంత్రాంగం మౌనంపై ప్రశ్నలు

రోజూ పదుల సంఖ్యలో ఇసుక టిప్పర్లు చెక్‌పోస్టులు, ప్రధాన రహదారుల మీదుగా యథేచ్ఛగా సంచరిస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం ఒక్క వాహనాన్ని కూడా పట్టుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ రవాణా అధికారులకు కనిపించడం లేదా? లేక ఇతర కారణాలతో చర్యలు తీసుకోవడం లేదా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

సరిహద్దుల్లో ప్రకృతి సంపదను అక్రమంగా తరలిస్తున్న వారిపై, వారికి సహకరిస్తున్న వారిపై, అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ప్రభుత్వం వెంటనే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## బీహార్‌లో బిజెపిక అతిపెద్ద షాక్

### బంకీపూర్ అసెంబ్లీలో ప్రశాంత్ కిశోర్ భారీ విజయం

### 30 ఏళ్ల కంచుకోటను బద్దలు కొట్టిన ప్రశాంత్



పాట్నా,ఆగస్టు 3 బిహార్‌లో సరికొత్త రాజకీయం ఆవిష్కృతం అయ్యింది. అలాగే బిజెపికి అతిపెద్ద షాక్ తగిలింది. బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా బిజెపికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు. ఉదయం కౌంటింగ్ మొదలైనప్పటి నుంచీ బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు. ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బీజేపీ హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిని బిహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బిహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. బంకీపూర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. బీజేపీ కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో.. 1995 నుంచి బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ అసాధారణ విజయం సాధించడం, బీజేపీ కంచుకోటలో జేఎస్‌పీ జెండా ఎగురవేయడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ప్రశాంత్ విజయంతో.. జేఎస్పీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి.

# బీటీ రోడ్డుపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్ నడిపితే చర్యలు తప్పవు

●సబ్ ఇన్స్పెక్టర్ జగదీశ్వర్



చిగురు మామిడి/ఆగస్టు 03, అక్షరం న్యూస్,

బీటీ రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చిగురు మామిడి సబ్ ఇన్స్పెక్టర్ జగదీశ్వర్ హెచ్చరించారు. సోమవారం పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీటీ రోడ్డుపై కేజ్‌వీల్స్ తో ట్రాక్టర్ నడపవద్దనిఒకవేళ రోడ్డు మీదకు ట్రాక్టర్‌ను తీసుకు వస్తె చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. బీటీ రోడ్లపై ట్రాక్టర్ కేజ్‌వీల్స్ తో నడిపితే రోడ్డు దెబ్బతిని, గుంతలు,పగుళ్లు పడి, దీని కారణం వల్ల వాహనాదారులు ప్రమాదాల బారిన పడి తీవ్రంగా గాయపడడమే కాకుండా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని,అందరికీ, ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడే రోడ్డును పాడు చేసుకోవద్దన్నారు. ట్రాక్టర్ కేజ్‌వీల్స్ ను నడిపించవద్ధని ఈ విషయంలో రైతులు ట్రాక్టర్ యజమానులు పోలీసుల సూచనలు,పాటించాలని, ట్రాక్టర్ యజమానులు ఇష్టారాజ్యంగా రోడ్లపై కేజ్‌వీల్స్‌ను నడిపిస్తే చర్యలు తప్పవని ఎస్సై అన్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి జైలు




భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఆగస్టు 3 / అక్షరం న్యూస్ -:: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సరిత నిందితులు ఇద్దరికీ 5 సంత్సరం ల జైలు శిక్ష, మరియు, 25 వేయిల రూపాయల చొప్పున ఇద్దరికి జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. బూర్గంపాడు నా ఎస్. ఐ. బి. బాలకృష్ణ భారత దేశ కర్ఫ్యూ పిలుపుమేరకు తన సిబ్బందితో పెట్రోలింగ్ చేయుచుండగా సారపాక బస్ స్టాప్ సెంటర్ రోడ్డు వద్ద 2020 మార్చ్ 22న హోండా స్కూటీపై ఇద్దరు వ్యక్తులు వచ్చుచుండగా వారిని తనిఖీ చేయగా 20 కిలోల గంజాయి దొరికగా వారు మహబూబాద్ జిల్లా మరిపెడ బంగ్లా కు చెందిన బీమనపల్లి శ్రీనివాసులు, రావీరాల లక్ష్మీనారాయణలు గా గుర్తించి బూర్గంపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఏఎస్ఐ. కే.సోమేశ్వరరావు కేసు నమోదు చేసుకోగా అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్లు పి.నవీన్ టీ.సత్యనారాయణలు దర్యాప్తు అనంతరం కోర్ట్ లో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏడు గురి సాక్షులను విచారించిన అనంతరం శ్రీనివాసులు లక్ష్మీనారాయణ పై నేరము నిర్ధారించి, ఇదరికి 5 స. జైలు, చెరో 25 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పి.ఫణి కుమార్ నిర్వహించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ డి.రాఘవయ్య, కోర్ట్ లైజాన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రం కోర్టు డ్యూటీ ఆఫీసర్ పిసి అక్రమ్ లు సహకరించారు.

# కీసర రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / ఆగస్టు 03 / : సోమవారం రోజు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, కీసర మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కీసర శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం అందించారు. అనంతరం శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధిగా ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రత్యేకంగా ప్రార్ధనలు చేశారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ అర్చకులు బీర్ల అయిలయ్య కు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు గడిపి భక్తులతో ఆప్యాయంగా పలకరించారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలు, దేవాలయాల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూనే, దైవానుగ్రహం కోసం తరచూ ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పాల్గొన్నారు...

# జిల్లా రైతు సంఘం అధ్యక్షులుగా జక్క దయాకర్ రెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / ఆగస్టు 03 / : ఆత్మకూర్ (యం):తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధ్యక్షులు జక్క దయాకర్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. రైతు సంఘం నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షునిగా తనను ఏకేగ్రంగా ఎన్నుకోవడం జరిగిందనీ, నన్ను జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు జిల్లా కమిటీకి నా బాధ్యతగా జిల్లా రైతు సంఘం బలోపేతం చేయడానికి సహాయశక్తి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు జక్క దయాకర్ రెడ్డి కి అభినందనలు తెలిపారు.

# గబ్బెటలో తల్లిపాల వారోత్సవాలు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) ఆగస్టు 03: మండలం లో ని గబ్బెట గ్రామంలోఅంగన్‌వాడీ కేంద్రం--1లో సోమవారం తల్లిపాలు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్వైజర్ మంజులత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని తెలిపారు. ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు తొలి టీకా వంటివని, వాటిలో రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు సమృద్ధిగా ఉంటాయని వివరించారు. శిశువుకు అవసరాన్ని బట్టి రోజుకు 10 నుంచి 15 సార్లు వరకు తల్లిపాలు ఇవ్వవచ్చని, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలే ఉత్తమ ఆహారమని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అరె అంజమ్మ, ఆయా సోమలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువును అభివృద్ధి చేసి సాగునీరు అందించాలి

●-బచ్చలి ప్రవీణ్ కుమార్



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఆగస్టు 03/ అక్షరం న్యూస్ -:

మందమర్రి మండలం లోని ఆదిల్‌పేట్ గ్రామ పరిధిలో ఉన్న ఎర్ర చెరువు ఈ ప్రాంత రైతులకు ప్రధాన సాగునీటి ఆధారంగా నిలుస్తోందని బచ్చలి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మందమర్రి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్ర చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి, దిగువన ఉన్న రైతుల భూములకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో గతంలో ప్రభుత్వం చెరువు పరిసర ప్రాంతాల్లోని 30 ఎకరాలకు పైగా పట్టా భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రజాధనం వెచ్చించి భూమిని కొనుగోలు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం చెరువును విస్తరించడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, వర్షాకాలంలో అధిక నీటిని నిల్వ చేసి సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమేనని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే చెరువు దిగువన ఉన్న వందల ఎకరాల వ్యవసాయ భూములకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశం ఉండేదన్నారు. అయితే, చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన 30 ఎకరాలకు పైగా భూమి ప్రస్తుతం మళ్లీ ఇతరుల ఆధీనంలోకి వెళ్లినట్లు సమాచారం ఉందని, ప్రజాధనం వెచ్చించి ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమి తిరిగి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి ఎలా వెళ్లిందనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువు అభివృద్ధి కోసం కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమిని వెంటనే గుర్తించి, పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. ఎక్కడైనా ఆక్రమణలు జరిగి ఉంటే వాటిని తొలగించాలని, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి భూమికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని అన్నారు. ప్రభుత్వం గతంలో నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా ఎర్ర చెరువును ఆధునిక పద్ధతుల్లో అభివృద్ధి చేసి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని, తద్వారా చెరువు దిగువన ఉన్న రైతుల పొలాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని బచ్చలి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, నీటి వనరుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని పరిరక్షించడంతో పాటు చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఉప సర్పంచ్ లకు జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలి

●ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం.

●మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు గిర్నాటి జనార్ధన్.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఆగస్టు 3/ అక్షరం న్యూస్ -:

గ్రామపంచాయతీల అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాయింట్ చెక్ పవర్ విధానాన్ని పూర్తిగా అమలు చేయాలని కోరుతూ మందమర్రి మండల ఉపసర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మందమర్రి మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు, చిర్రకుంట ఉపసర్పంచ్ గిర్నాటి జనార్ధన్ మాట్లాడుతూ, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్--ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ అధికారాన్ని కల్పించిందని తెలిపారు. అయితే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ద్వారా చేపడుతున్న పనుల బిల్లులను ఉపసర్పంచ్‌లకు సంబంధం లేకుండా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల సంతకాలతోనే డ్రా చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాలు, మండలాల్లో మాత్రం నిబంధనల ప్రకారం సర్పంచ్--ఉపసర్పంచ్‌ల జాయింట్ చెక్ పవర్ ద్వారానే నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. అదే విధానాన్ని మందమర్రి మండలంలో కూడా అమలు చేసి, గ్రామపంచాయతీ నిధులను సర్పంచ్--ఉపసర్పంచ్‌ల సంయుక్త సంతకాల ద్వారానే విడుదల చేయాలని ఎంపీడీవోను కోరినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, చట్ట నిబంధనలకు అనుగుణంగా జాయింట్ చెక్ పవర్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, ఉపసర్పంచ్‌ల హక్కులను పరిరక్షించాలని గిర్నాటి జనార్ధన్ డిమాండ్ చేశారు.

# ఉల్లంపల్లిలో గ్రామసభ



చిగురుమామిడి/ ఆగస్టు 03, అక్షరం న్యూస్,

చిగురుమామిడి మండలం లో నీ ఉల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో సర్పంచ్ అలువాల శంకర్ అధ్యక్షతన సోమవారం గ్రామ నిర్వహించారు. గ్రామసభలో గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 20 శాతం ప్రజల భాగస్వామ్యం, 80 శాతం బాలవికాస్ సంస్థ సహకారంతో గ్రామంలో ఆర్.ఓ. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని,విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయం ఏర్పాటు, గ్రామంలో ఉన్న 600కు పైగా పాడి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వెటర్నరీ ఆసుపత్రి, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.అలాగే గ్రామ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే నిర్వహించబడతాయని, అనుమతి లేకుండా ఇతరులు కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామసభ లో తీర్మానం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ అలువాల శంకర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారం, మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఉల్లంపల్లి ని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ గ్రామ సభలో వార్డు సభ్యులు కొల రజిత, కానవేనీ రజినీకాంత్ పంచాయితీ కార్యదర్శి జ్యోతి, వివో.శ్రీలత, పద్మ, శారద, జమున, లక్ష్మణ్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మాత్ర వేసుకున్న తర్వాత శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా?

ఏ మాత్రం అనారోగ్యానికి గురైనా, శరీరంలో ఏ భాగం నొప్పికి గురైనా వెంటనే గుటుక్కున మాత్ర మింగేస్తుంటారు. కడుపులో అజీర్తి చేసినా, తలనొప్పిగా అనిపించినా మాత్రవైపు దృష్టి మరలుతుంది. మధుమేహమైనా, బీపీని నియంత్రించాలన్నా.. పూటపూటకీ ఓ మందుబిళ్ల పడాల్సిందే. అయితే.. ఈ ట్యాబ్లెట్లకు శరీరంలో నొప్పెక్కడో, సమస్యేంటో ఎలా తెలుస్తుంది? వేసుకున్న కొన్ని నిమిషాలకే ఆ సమస్య నుంచి ఎలా బయటపడేస్తుంది.? వంటి సందేహాలపై ప్రత్యేక వివరణ మీకోసం...

**మాత్ర పనిచేసే విధానం:**

మాత్రను మింగిన వెంటనే అది ఈసోఫాగస్(గొంతు మార్గం) ద్వారా కడుపులోకి చేరుతుంది. తర్వాత కడుపులో ఉన్న ఆమ్లాలు దానిని కరిగించడం ప్రారంభిస్తాయి. కొన్ని మాత్రలు వెంటనే కరుగుతాయి. మరికొన్ని ఆలస్యంగా పనిచేస్తాయి. మాత్రలోని ఔషధ పదార్థాలు చిన్నపేగు ద్వారా రక్తంలోకి శోషణం చెందుతాయి. ఇది అత్యంత కీలక దశగా వైద్య నిపుణులు చెబుతారు. రక్తం ద్వారా అందులోని ఔషధాలు శరీరంలోని వివిధ భాగాలకు చేరతాయి. అవసరమైన అవయవం వద్ద అది ఎక్కువగా పనిచేస్తుంది. ఇక్కడే అసలు పని ప్రారంభమవుతుంది.

నొప్పి మందులైతే నాడీ వ్యవస్థపై పనిచేస్తాయి. య ాంటీబయోటిక్స్ అయితే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. ఇతర మందులు హార్మోన్లు లేదా రసాయన చర్యలను నియంత్రిస్తాయి. లివర్(కాలేయం) ఔషధాన్ని రసాయన మార్పులకు గురిచేస్తుంది. దీనినే విఘటన(మెటబాలిజం) అంటారు. చివరగా కిడ్నీలు(మూత్రపిండాలు), మలవిసర్జన ద్వారా ఔషధ అవశేషాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి.

పాటించాల్సిన నియమాలు: సమయపాలన: ఏ మాత్రను ఎలా వేసుకోవాలనే(తిన్న తర్వాత లేదా ఖాళీ కడుపుతో) విషయమై తప్పనిసరిగా వైద్యుల సలహాను పాటించాలి. ఇది మందుల శోషణపై ప్రభావం చూపుతుంది.

# పర్యావరణానికి ఎంతో మేలు చేసే ప్లానెటరీ హెల్త్ డైట్.. అసలేంటిది.. దీన్ని ఎలా పాటించాలి..?

ఈట్-లాన్సెట్ డైట్ లేదా ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమి సహజ వనరులను రక్షించేందుకు రూపొందించిన శాస్త్రీయ ఆహార విధానం. 2019లో 16 దేశాలకు చెందిన 37 మంది నిపుణులు కలిసి ఈ డైట్‌ను రూపొందించారు. 2050 నాటికి 10 బిలియన్ జనాభాకు ఆహారం అందించడంలో పర్యావరణానికి నష్టం కలగకుండా ఉండటం దీని ప్రధాన లక్ష్యం. ఈ డైట్ కఠినమైన నియమాలపై ఆధారపడినది కాదు. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చుకునే విధంగా ఉంటుంది. ఇందులో కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పప్పులు, గింజలు ప్రధాన భాగంగా ఉంటాయి. అలాగే పాలు, గుడ్లు, మాంసం వంటి వాటిని చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలని ఈ డైట్ సూచిస్తుంది. సాధారణంగా పురుషులకు రోజుకు సుమారు 2,500 కేలరీలు, మహిళలకు 2,000 కేలరీలు సూచిస్తారు. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ప్రపంచవ్యాప్తంగా అనుసరించదగిన రిఫరెన్స్ డైట్‌గా పరిగణించబడుతుంది. ఇది భిన్న ప్రాంతాలు, సంస్కృతులకు అనుగుణంగా మార్పులు చేసుకునే అవకాశం ఇస్తుంది. ముఖ్యంగా మొక్కల ఆధారిత ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని, జంతు ఆధారిత ఆహారాన్ని తగ్గించాలని సూచిస్తుంది.

### ఏయే ఆహారం ఎంత తీసుకోవాలి..

ఈ డైట్‌లో ఆహారం ఎంత మోతాదులో తీసుకోవాలో కూడా సూచించబడుతుంది. రోజుకు కనీసం 300 గ్రాముల కూరగాయలు, 200 గ్రాముల పండ్లు తీసుకోవాలి. సంపూర్ణ ధాన్యాలు సుమారు 232 గ్రాములు తీసుకోవడం ద్వారా శరీరానికి స్థిరమైన శక్తి లభిస్తుంది. అలాగే పప్పులు 75 గ్రాములు, గింజలు 50 గ్రాములు, ఆరోగ్యకరమైన నూనెలు 40 గ్రాములు తీసుకోవాలి.



పాలు, గుడ్లు, చేపలు, చికెన్ వంటి ప్రోటీన్ ఆహారాలను మాత్రం పరిమితంగా తీసుకోవాలి. రోజుకు 250 గ్రాముల పాలు, గుడ్లు ఒకరోజు విడిచి ఒకటి, చేపలు లేదా చికెన్ 29 గ్రాములు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎర్ర మాంసం (రెడ్ మీట్) కేవలం 14 గ్రాములకే పరిమితం చేయాలి. అదనపు చక్కెర 31 గ్రాములకు మించకూడదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ భూమి, నీటి వనరులను భారీగా వినియోగిస్తూ, గ్రీన్ హౌస్ వాయువులను అధికంగా విడుదల చేస్తున్నారు. ఈ డైట్‌ను అనుసరించడం ద్వారా పర్యావరణంపై పడే ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎర్ర మాంసం వినియోగం 80-90% వరకు తగ్గించాల్సిన అవసరం ఉంది.

### అనేక లాభాలు..

ప్లానెటరీ హెల్త్ డైట్ అనుసరించడం వల్ల ఆరోగ్యపరమైన అనేక లాభాలు ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు అధికంగా ఉండటం వల్ల శరీరంలో వాపు, ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. వ్యాధుల బారిన పడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

హార్వర్డ్ పరిశోధన ప్రకారం, ఈ డైట్‌ను క్రమంగా పాటించడం వల్ల ముందస్తు మరణ ప్రమాదం సుమారు 30% వరకు తగ్గుతుంది. గుండె వ్యాధులు, క్యాన్సర్, స్ట్రోక్, డయాబెటిస్ వంటి వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి 11 మిలియన్ మరణాలను నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ డైట్ గుండె, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలోనూ సహాయపడుతుంది. మొక్కల ఆధారిత ఆహారాలు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. అలాగే మెదడు పనితీరును కాపాడి మతిమరుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఈ డైట్ ఉపయోగకరంగా ఉంటుంది. ఫైటోకెమికల్స్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి రక్షణ లభిస్తుంది. ప్రాసెస్డ్ ఫుడ్స్, రెడ్ మీట్ తగ్గించడం ద్వారా క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది

### పర్యావరణ పరిరక్షణ కూడా..


పర్యావరణ పరిరక్షణలో కూడా ఈ డైట్ కీలక పాత్ర పోషిస్తుంది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను 29% వరకు తగ్గించడమే కాకుండా, ఎరువుల వినియోగాన్ని 21% వరకు తగ్గిస్తుంది. వ్యవసాయ భూమి అవసరాన్ని కూడా 51% వరకు తగ్గించే సామర్థ్యం ఉంది. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యానికి, పర్యావరణానికి సమతుల్యమైన పరిష్కారం. సరైన ఆహార ఎంపికల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమిని కూడా రక్షించవచ్చు. అయితే ఈ డైట్‌ను అనుసరించే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# తరచూ నెలసరి నొప్పులు వస్తున్నాయా..? మహిళలు దీన్ని అసలు నిర్లక్ష్యం చేయకూడదు..!

మహిళలు నెలసరి నొప్పులను సాధారణంగా భావిస్తారు. చాలా మంది మహిళలు వీటిని అసలు పట్టించుకోరు. అయితే ఈ నొప్పి తీవ్రంగా మారి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటే, దాన్ని సాధారణంగా తీసుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఇలాంటి తీవ్రమైన నొప్పులు సెకండరీ డిస్మెనోరియా అనే తీవ్రమైన సమస్యకు సంకేతం కావొచ్చని వారుహెచ్చరిస్తున్నారు. తీవ్రమైన లక్షణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని ప్రతి నెల మందులపై ఆధారపడటం, స్కూల్ లేదా పనికి వెళ్లలేకపోవడం వంటి పరిస్థితులు ప్రమాద సూచికలుగా భావించాలని వైద్యులు చెబుతున్నారు. అలాగే నొప్పి కాలక్రమేణా నొప్పి తీవ్రత పెరగడం లేదా పీరియడ్ సమయంలో కాకుండా ఇతర సమయాల్లో కూడా నొప్పి ఉండడం వంటి వాటిని తేలికగా తీసుకోకూడదని ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

### రెండు రకాలుగా ఉంటాయి..

నెలసరి నొప్పులను సాధారణంగా రెండు రకాలుగా విభజిస్తారు. మొదటిది ప్రైమరీ డిస్మెనోరియా. ఇది సాధారణంగా ఏదైనా ప్రత్యేక కారణం లేకుండా వస్తుంది. ఇది ప్రోస్టాగ్లాండిన్స్ అనే హార్మోన్‌లాంటి రసాయనాల వల్ల గర్భాశయం సంకోచాలు కలగడం వల్ల వస్తుంది. సాధారణంగా మందులు, జీవనశైలి మార్పులతో దీనిని నియంత్రించవచ్చు. ఇక రెండవది సెకండరీ డిస్మెనోరియా. ఇది గర్భాశయానికి సంబంధించిన ఇతర ఆరోగ్య సమస్యల వల్ల వస్తుంది. దీని వల్ల వచ్చే నొప్పి ఎక్కువగా తీవ్రంగా ఉంటుంది, కాలక్రమేణా



పెరుగుతుంది. అదనంగా అధిక రక్తస్రావం, అలసట, పీరియడ్ కాకుండా కూడా పెల్విక్ నొప్పి, మల విసర్జన లేదా లైంగిక సంబంధాల సమయంలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

### 20 నుంచి 40 శాతం మంది మహిళల్లో..

సెకండరీ డిస్మెనోరియాకు ప్రధాన కారణాలలో ఒకటి ఎండోమెట్రియోసిస్. ఇందులో గర్భాశయపు లోపలి పొరల మాదిరిగా ఉండే కణజాలం గర్భాశయం బయట పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 శాతం మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. భారతదేశంలో సుమారు 4.2 కోట్ల మంది మహిళలు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. దీర్ఘకాలిక పెల్విక్ నొప్పితో బాధపడే మహిళల్లో 30-70 శాతం వరకు ఈ వ్యాధి ఉండే అవకాశముంది. అయినప్పటికీ ఈ సమస్య చాలా సందర్భాల్లో గుర్తించబడదు. అలాగే నెలసరి సమయంలో తీవ్రమైన నొప్పి రావడానికి మరొక కారణం గర్భాశయంలో ఏర్పడే ఫైబ్రాయిడ్స్ (గడ్డలు). ఇవి క్యాన్సర్ కాని గడ్డలు అయినప్పటికీ 20-40 శాతం భారతీయ మహిళల్లో కనిపిస్తాయి. ముందుగా ఇవి పెద్ద వయస్సులో మాత్రమే కనిపిస్తాయని భావించేవారు. కానీ ప్రస్తుత కాలంలో యువతుల్లో కూడా ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. జీవనశైలి మార్పులు, కాలుష్యం, ప్రాసెస్ చేసిన ఆహారం, ఒత్తిడి, స్థూలకాయం, ప్లాస్టిక్‌లో ఉండే హానికర రసాయనాలు వంటి అంశాలు హార్మోన్ అసమతుల్యతకు దారి తీస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరంలో ఈస్ట్రోజన్‌ను అనుకరించి వాపులను పెంచి, ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యలకు కారణమవుతున్నాయని వారు తెలియజేస్తున్నారు.

### మందులు దీర్ఘకాలం వద్దు..

నెలసరి నొప్పుల కోసం ఎక్కువగా ఉపయోగించే ఐబుప్రోఫెన్ వంటి నాన్-స్టెరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు తాత్కాలిక ఉపశమనం ఇస్తాయి. కానీ దీర్ఘకాలం వాడితే జీర్ణాశయ సమస్యలు, అల్సర్లు, కిడ్నీ సమస్యలు, రక్తపోటు వంటి ప్రమాదాలు కలుగుతాయని, ముఖ్యంగా ఇవి అసలు సమస్యను దాచిపెట్టే ప్రమాదం కూడా ఉందని వైద్యులుహెచ్చరిస్తున్నారు. కనుక పీరియడ్ నొప్పులు తరచూ వస్తుంటే లేదా తీవ్రంగా మారితే ఆలస్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలి. మొదట అల్ట్రాసౌండ్ లేదా సోనోగ్రఫీ ద్వారా పరీక్షించి, అవసరమైతే గైనకాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే రక్తహీనత, గర్భాశయంలో గాయాలు, వంధ్యత్వం వంటి సమస్యలను నివారించవచ్చునని అన్ని వేళలా నెలసరి నొప్పిని తేలికగా తీసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

## మాత్ర వేసుకున్న తర్వాత శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా?

ఏ మాత్రం అనారోగ్యానికి గురైనా, శరీరంలో ఏ భాగం నొప్పికి గురైనా వెంటనే గుటుక్కున మాత్ర మింగేస్తుంటారు. కడుపులో అజీర్తి చేసినా, తలనొప్పిగా అనిపించినా మాత్రవైపు దృష్టి మరలుతుంది. మధుమేహమైనా, బీపీని నియంత్రించాలన్నా.. పూటపూటకీ ఓ మందుబిళ్ల పడాల్సిందే. అయితే.. ఈ ట్యాబ్లెట్లకు శరీరంలో నొప్పెక్కడో, సమస్యేంటో ఎలా తెలుస్తుంది? వేసుకున్న కొన్ని నిమిషాలకే ఆ సమస్య నుంచి ఎలా బయటపడేస్తుంది.? వంటి సందేహాలపై ప్రత్యేక వివరణ మీకోసం...

### మాత్ర పనిచేసే విధానం:

మాత్రను మింగిన వెంటనే అది ఈసోఫాగస్(గొంతు మార్గం) ద్వారా కడుపులోకి చేరుతుంది. తర్వాత కడుపులో ఉన్న ఆమ్లాలు దానిని కరిగించడం ప్రారంభిస్తాయి. కొన్ని మాత్రలు వెంటనే కరుగుతాయి. మరికొన్ని ఆలస్యంగా పనిచేస్తాయి. మాత్రలోని ఔషధ పదార్థాలు చిన్నపేగు ద్వారా రక్తంలోకి శోషణం చెందుతాయి. ఇది అత్యంత కీలక దశగా వైద్య నిపుణులు చెబుతారు. రక్తం ద్వారా అందులోని ఔషధాలు శరీరంలోని వివిధ భాగాలకు చేరతాయి. అవసరమైన అవయవం వద్ద అది ఎక్కువగా పనిచేస్తుంది. ఇక్కడే అసలు పని ప్రారంభమవుతుంది.

నొప్పి మందులైతే నాడీ వ్యవస్థపై పనిచేస్తాయి. య ాంటీబయోటిక్స్ అయితే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. ఇతర మందులు హార్మోన్లు లేదా రసాయన చర్యలను నియంత్రిస్తాయి. లివర్(కాలేయం) ఔషధాన్ని రసాయన మార్పులకు గురిచేస్తుంది. దీనినే



విఘటన(మెటబాలిజం) అంటారు. చివరగా కిడ్నీలు(మూత్రపిండాలు), మలవిసర్జన ద్వారా ఔషధ అవశేషాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి.

పాటించాల్సిన నియమాలు: సమయపాలన: ఏ మాత్రను ఎలా వేసుకోవాలనే(తిన్న తర్వాత లేదా ఖాళీ కడుపుతో) విషయమై తప్పనిసరిగా వైద్యుల సలహాను పాటించాలి. ఇది మందుల శోషణపై ప్రభావం చూపుతుంది.విశ్రాంతి: మందులు వేసుకున్నాక శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి.

## వేసవిలో శరీరానికి ఐరన్ లభించాలంటే.. ఈ ఆహారాలను తీసుకోవాలి..



ఇనుము మనిషి శరీరానికి అత్యంత అవసరమైన ఖనిజం. ఇది హిమోగ్లోబిన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. హిమోగ్లోబిన్ రక్తం ద్వారా ఆక్సిజన్‌ను శరీరమంతా చేరవేయ డానికి సహాయపడుతుంది. శరీరంలో ఇనుము సరిపడినంత ఉండటం వల్ల శక్తి స్థాయిలు, మెదడు పనితీరు మెరుగ్గా ఉంటాయి.

### దానిమ్మ పండ్లు, బీట్ రూట్..

వేసవిలో ఐరన్ ను పెంచుకోడానికి దానిమ్మ పండు మంచి ఎంపిక. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఇనుము, ఫైబర్, పొటాషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, జీర్ణక్రియను సులభతరం చేయడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. పాలకూర కూడా ఇనుముకు మంచి వనరు. ఇది నాన్-హీమ్ ఐరన్ కలిగి ఉండటంతో శరీరానికి ఉపయోగపడుతుంది. దీనిని సలాడ్లు, పప్పు లేదా స్మూతీల రూపంలో తీసుకోవచ్చు. బీట్‌రూట్ రక్త ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది రెడ్ బ్లడ్ సెల్స్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. వేసవిలో దీన్ని సలాడ్ లేదా రైతా రూపంలో తీసుకోవచ్చు. పప్పులు, శనగలు వంటి ఆహారాలు కూడా మంచి ఐరన్ వనరులు. ఇవి శాకాహారులకు ఉత్తమమైన ఎంపికగా నిలుస్తాయి, రోజువారీ ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. పుచ్చకాయలో ఇనుము తక్కువగా ఉన్నప్పటికీ, వేసవిలో శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఇది దాహాన్ని తీర్చడంలో కూడా సహాయపడుతుంది. బెల్లం సహజంగా ఇనుము అందించే ఆహారం. చక్కెరకు బదులుగా కొద్దిగా బెల్లం తీసుకోవడం వల్ల శరీరానికి కొంత ఇనుము లభిస్తుంది. అయితే దీనిని మితంగా మాత్రమే తీసుకోవాలి.

### మునగ ఆకులు, విటమిన్ సి..

మునగలో ప్లాంట్-బేస్డ్ ఐరన్ అధికంగా ఉంటుంది. ఇందులో విటమిన్ సి కూడా ఉండటంతో ఐరన్ శోషణను మెరుగుపరుస్తుంది. అందువల్ల ఇది ప్రత్యేకంగా ఉపయోగకరమైన ఆహారమని చెప్పవచ్చు. ఇవే కాకుండా గింజలు, విత్తనాలు, పూర్తి ధాన్యాలు, చేపలు, డ్రై ఫ్రూట్స్ కూడా ఐరన్ మంచి వనరులుగా పరిగణించబడతాయి. ఈ ఆహారాలను తీసుకోవడంతోపాటు ఐరన్ శోషణను మెరుగుపరచడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. హీమ్, నాన్-హీమ్ ఐరన్ రెండింటినీ కలిపి తీసుకోవడం మంచిది. అలాగే విటమిన్ సి ఉన్న ఆహారాలను ఐరన్ ఉన్న భోజనంతో తీసుకుంటే శరీరం ఐరన్‌ను సులభంగా గ్రహిస్తుంది. అదేవిధంగా టీ, కాఫీ, కాల్షియం వంటి పదార్థాలను ఐరన్ ఉన్న భోజనంతో కలిసి తీసుకోవడం నివారించాలి, ఎందుకంటే ఇవి ఐరన్ శోషణను తగ్గిస్తాయి. వేసవిలో ఈవిధంగా సరైన ఆహారం, మంచి అలవాట్ల ద్వారా శరీరంలో ఇనుము స్థాయిని సులభంగా పెంచుకోవచ్చు. ఇది ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

## పాదాల వద్ద వాపులు తరచూ వస్తున్నాయా..? అందుకు కారణాలేంటి.. ఏం చేయాలి..?



ఎక్కువసేపు నిలబడటం, ప్రయాణాలు చేయడం లేదా ఒకే స్థితిలో కూర్చోవడం వల్ల చీలమండలు వాపు రావడం సాధారణం. అయితే ఈ వాపు తరచుగా కొనసాగితే, అది లోపల ఉన్న ఆరోగ్య సమస్యలకు సంకేతంగా మారవచ్చని వైద్యులు చెబుతున్నారు. వైద్యులు ఇలాంటి పరిస్థితుల్లో ఆంకిల్ స్వెల్లింగ్ టెస్ట్ లేదా పిట్టింగ్ ఎడిమా టెస్ట్ అనే సులభమైన పరీక్ష ద్వారా శరీరంలో ద్రవం నిల్వ ఉందో లేదో పరీక్షచేస్తారు. ఈ పరీక్ష చాలా సులభంగా ఉంటుంది. చీలమండలం దగ్గర లేదా కాలి మోకాలిపై వైద్యుడు కొన్ని సెకన్లు వేళ్లతో నొక్కి వదిలేస్తారు. నొక్కిన తర్వాత చర్మం వెంటనే మామూలు స్థితికి వస్తే పెద్ద సమస్య ఉండకపోవచ్చు. కానీ ఆ చోట చిన్న గుంతలా మిగిలితే దానిని పిట్టింగ్ ఎడిమా అంటారు. ఇది శరీరంలో ద్రవం ఎక్కువగా నిల్వ ఉన్న సంకేతంగా పరిగణించబడుతుంది.

### కారణాలు ఇవే..

శరీరంలో ద్రవం ఎక్కువగా పేరుకుపోవడానికి ముఖ్య కారణం రక్తప్రసరణలో లేదా ద్రవ సమతుల్యంలో లోపం రావడం. గురుత్వాకర్షణ వల్ల ఈ ద్రవం కాళు ,, పాదాల దగ్గర ఎక్కువగా చేరుతుంది. గుండె, మూత్రపిండాలు లేదా కాలేయం సరిగా పనిచేయకపోతే ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నప్పుడు కూడా కాళ్ల వాపు కనిపించవచ్చు. ముఖ్యంగా గుండె రక్తాన్ని సరిగ్గా పంపించలేకపోతే రక్తప్రసరణ మందగిస్తుంది. దీని వల్ల ద్రవం కాళ్లలో పేరుకుపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, అకస్మాత్తుగా బరువు పెరగడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. అలాగే మూత్రపిండాలు శరీరంలో ఉండే అదనపు నీరు, ఉప్పును బయటకు పంపడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. అవి సరిగా పనిచేయకపోతే ద్రవం శరీరంలోనే నిల్వ అయి కాళ్లు, పాదాలు, కొన్నిసార్లు ముఖం కూడా వాపు రావచ్చు.

### ఇలా కూడా జరగవచ్చు..

దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి ఉన్నవారిలో ఈ సమస్య క్రమంగా పెరుగుతూ కనిపిస్తుంది. అయితే ప్రతి కాళ్ల వాపు ప్రమాదకరమే అనుకోవాల్సిన అవసరం లేదు. ఎక్కువసేపు కూర్చోవడం, నిలబడటం, అధిక ఉప్పు తీసుకోవడం, గర్భధారణ లేదా కొన్ని మందులు వాడటం వల్ల కూడా తాత్కాలికంగా వాపు రావచ్చు. అలాగే రక్తనాళాల సమస్యలు ఉన్నప్పుడు కూడా కాళ్లలో ద్రవం చేరుతుంది. సాధారణంగా కొద్దిగా వాపు వస్తే పెద్దగా ఆందోళన అవసరం లేదు. కానీ వాపు ఎక్కువకాలం కొనసాగితే, పెరుగుతూ ఉంటే లేదా ఇతర లక్షణాలతో కలిసి ఉంటే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించాలి.

### ఈ లక్షణాలు ఉంటే..

ముఖ్యంగా శ్వాసలో ఇబ్బంది, ఛాతి నొప్పి, ఆకస్మిక బరువు పెరుగుదల, తీవ్రమైన అలసట, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యులు అవసరమైతే రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు లేదా స్కానింగ్ వంటి పరీక్షలు చేసి అసలు కారణాన్ని గుర్తిస్తారు. సరైన సమయంలో చికిత్స తీసుకుంటే తీవ్రమైన సమస్యలను ముందుగానే నివారించవచ్చు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609